మంగళవారం
31-05-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 70, సంచిక : 337
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

హవాలా కేసులో ఢిల్లీ ఆరోగ్యమంత్రి అరెస్టు

ఢిల్లీ ఆరోగ్యశాఖ మంత్రి సత్యేందర్ జైన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసింది. కోల్‌కతా కేంద్రంగా పనిచేసే ఓ సంస్థతో సంబంధమున్న హవాలా కేసులో ఆయన్ను సోమవారం అదుపులోకి తీసుకుంది. జైన్ కుటుంబం, కంపెనీలకు చెందిన రూ.4.81 కోట్ల విలువైన ఆస్తులను తాత్కాలికంగా జప్తుచేసినట్లు గత నెలలో ఈడీ పేర్కొంది.

8 లో

ధరలు, పన్నుల భారాలపై

ప్రజాగ్రహం

ప్రజలను హింసిస్తున్న మోదీ, జగన్

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాలో రామకృష్ణ హెచ్చరిక
- అనంతపురంలో సీపీఎం నేత శ్రీనివాసరావు అరెస్ట్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :

దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో పెరిగిన పెట్రోలు, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు, మరో పక్క ఇబ్బడిముబ్బడిగా ప్రజలపై వివిధ రూపాల్లో మోపుతున్న పన్నుల భారాలపై ప్రజాగ్రహం పెల్లుబుకింది. అధిక ధరలు, పన్నుల భారాలపై 10 వామపక్షాల పిలుపు మేరకు సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు రాజకీయాల కతీతంగా పెద్దసంఖ్యలో పాల్గొని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినదించారు. పెంచిన ధరలు తగ్గించకపోతే ఓటు ద్వారానే తగిన బుద్ధి చెపుతామని హెచ్చరించారు. విజయవాడలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్, సీపీఎం సిటీ కో-ఆర్డినేటర్ డి.కాశీనాథ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ ధర్నాలో ఖాళీ గ్యాస్ సిలిండర్లు, నిత్యావసర సరుకులను చేతపట్టుకుని వినూత్నరీతిలో వామపక్ష నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఎనిమిదేళ్ల పాలనలో ఏ తప్పు చేయలేదని, దేశ ప్రతిష్ఠ పెంచానని నరేంద్ర మోదీ చెప్పడం సిగ్గుచేటన్నారు. ఎనిమిదేళ్ల పాలనలో దేశ ప్రజలకు ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గ్యాస్ సిలిండ్ ధర రూ.460కి పెరిగితే ఢిల్లీ వీధుల్లో సిలిండర్లు పట్టుకుని నేడు కేంద్ర మంత్రులుగా ఉన్న స్మృతి ఇరానీ, నిర్మలా సీతారామన్ వంటివారు ర్యాలీలు నిర్వహించారని గుర్తు చేశారు. ఇప్పుడు కేవలం ఎనిమిదేళ్లలో గ్యాస్ సిలిండర్ ధర రూ.460 నుంచి రూ.1,052కు పెరిగినా, పెట్రోల్, డీజిల్ ధరలు సెంచరీ దాటినా నోరుమెదపడం లేదన్నారు. అదే సమయంలో రాష్ట్రాలు ధరలు పెంచుతున్నాయని తప్పుడు ప్రచారం చేయడం బీజేపీ దుర్మార్గపు విధానాలకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో సీఎం జగన్ కూడా కూడా ప్రజలపై పన్నుల భారాలు మోపుతున్నారని, దక్షిణ భారతదేశంలో అన్ని రాష్ట్రాల కన్నా పెట్రోల్, డీజిల్ ధరలు ఆంధ్రాలోనే రూ.10 ఎక్కువ అని చెప్పారు. అన్నింటికి మించి చెత్త సేకరణపై కూడా పన్ను విధించిన చెత్త ప్రభుత్వంగా నిలిచిపోయిందన్నారు. కార్మికులు, రైతులు, సామాన్య ప్రజానీకంపై భారాలు మోపుతూ కార్పొరేట్లకు రాయితీలు ఇస్తోందని, మోదీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ మోదీ ఎనిమిదేళ్ల పాలనలో దేశాన్ని, ప్రజల

- మిగతా 2 లో

విజయవాడలో సిలిండర్లు మోసి నిరసన తెలుపుతున్న రామకృష్ణ, ఓబులేశు, హరినాథ్, దోనేపూడి శంకర్, కోటేశ్వరరావు, బాబూరావు, కాశీనాథ్ తదితరులు

పల్నాడు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాలో ముప్పాళ్ల నాగేశ్వరరావు, మారుతీప్రసాద్, విజయ్‌కుమార్, రాంబాబు, మణి తదితరుల ధర్నా

అనంతపురంలో బుర్ఖా వేసుకొని వచ్చిన జాఫర్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజా సాంస్కృతిక విధానం కోసం

పోరు

ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభ తీర్మానం

విశాలాంధ్ర-కడప రూరల్:

ప్రజాసమస్యలపై ప్రజలను చైతన్యవంతులను చేసే విధంగా ప్రజానాట్యమండలి కళారూపాలను తయారుచేస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రా నాయక్, చిన్నం పెంచలయ్య తెలిపారు. ప్రజా సాంస్కృతిక విధానం కోసం పోరాడుతుందని చెప్పారు. సోమవారం ఇక్కడి ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ, కడపలో ఐదు రోజుల పాటు జరిగిన ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర 10వ మహాసభ నిర్ణయాలు, కళా ఉత్సవాలు వివరాలను వెల్లడించారు. ప్రజా చైతన్యం కోసం ప్రజానాట్య మండలి అనేక సంవత్సరాలుగా కళా రూపాలను తయారు చేసుకుని ప్రజలను జాగృతం చేస్తోందన్నారు. గ్రామీణ కళాకారులకు తిరుమల తిరుపతి దేవస్థానంలోను కళా ప్రదర్శనలుకు అనుమతి ఇవ్వాలని, యువతను పెడదారి పట్టించే టీవీ సీరియల్స్, అశ్లీలత, హింసా, పోర్న్ వీడియో లాంటి వాటిపై నిషేధం ప్రకటించాలని, ప్రశ్నించే కవులు, రచయితలు, కళాకారులపై ప్రభుత్వం విధిస్తున్న నిషేధాజ్ఞలను ఎత్తి వేయాలి, అక్రమ కేసులు బనాయించడాన్ని మానుకోవాలని కోరుతూ

చంద్రానాయక్

పెంచలయ్య

బాబ్జీ

ఆర్.రామకృష్ణ

- మిగతా 2 లో

ప్రైవేటీకరణ దూకుడు

- రెండు ప్రభుత్వరంగ బ్యాంకులపై ముందస్తు చర్యలు
- వెల్లడించిన ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి

న్యూఢిల్లీ:

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చర్యలను వేగవంతం చేసింది. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తోంది. మరో రెండు ప్రభుత్వ రంగ బ్యాంకులు త్వరలోనే ప్రైవేట్ పరం కానున్నాయి. మొన్న విశాఖ స్టీల్‌ప్లాంట్... నిన్న ఎల్ఐసీ... నేడు బ్యాంకులు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేసే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు ఒకదానివెంట మరొకటి అమలవుతు న్నాయి. గతంలో నిర్ణయించినట్లే రెండు ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రం కీలక చర్యలు తీసుకుంటోంది.

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటనకు అనుగుణంగా రెండు ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణకు ముందస్తు చర్యలు కొనసాగుతున్నాయని ఆర్థిక సేవల విభాగం కార్య దర్శి సంజయ్ మల్హోత్రా సోమవారం తెలిపారు. 2021-22 కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం సంవత్స రంలో రెండు పీఎస్‌యూ (ప్రభుత్వరంగ బ్యాం కులు) ప్రైవేటీకరణను చేపట్టాలని తన ఉద్దేశాన్ని ప్రకటించింది. ప్రభుత్వ రంగ సంస్థలలో వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ విధానాన్ని ఆమోదించింది. 'బ్యాంకింగ్ ప్రైవేటీకరణ విషయానికొస్తే, ఆర్థిక మంత్రి ద్వారా ఇప్పటికే ఒక ప్రకటన ఉంది. దీనిపై ముందస్తు చర్యలు కొనసాగుతున్నాయి' అని జూన్ 6-12 మధ్య జరిగే కర్టెన్ రైజర్ ఈవెంట్ 'ఐకానిక్ వీక్ ఆఫ్ ది ఫైనాన్స్ మినిస్ట్రీ' సందర్భంగా మల్హోత్రా చెప్పారు. 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌లో ఈ సంవత్సరంలో రెండు ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణ, ప్రభుత్వ రంగ సంస్థలలో వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ విధానానికి ఆమోదం తెలపాలని ప్రభుత్వం తన ఉద్దేశాన్ని ప్రకటించిందని సీతారామన్ పార్లమెంటులో తెలిపారు. ప్రభుత్వ మేధోమథన సంస్థ నీతి ఆయోగ్ ఇప్పటికే ప్రైవేటీకరణ కోసం పెట్టుబడుల ఉపసంహరణపై ప్రధాన కార్యదర్శుల బృందానికి రెండు బ్యాంకులు, ఒక బీమా కంపెనీని సూచించింది. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,

- మిగతా 2 లో

శృతి శర్మ

అంకిత అగర్వాల్

గామిని సింగ్లా

అమ్మాయిలదే అగ్రస్థానం

- ఆలిండియా టాపర్ శృతిశర్మ
- వందలోపు ఐదుగురు తెలుగు విద్యార్థులు
- సివిల్ సర్వీసెస్-2021 ఫలితాలు విడుదల

పూసపాటి సాహిత్య

భరద్వాజ్

న్యూఢిల్లీ:

సివిల్స్ -2021 తుది ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం నిర్వహించిన పరీక్షలో 685 మందిని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఎంపిక చేసింది. అందులో 508 మంది పురుషులు, 177మంది మహిళలు ఉన్నారు. వీరందరినీ కమిషన్ వేర్వేరు కేంద్ర సర్వీసులకు సిఫార్సు చేసింది. కాగా సివిల్స్ ఫలితాల్లో తొలి నాలుగు స్థానాల్లో అమ్మాయిలే నిలిచారు. శృతి శర్మ అఖిలభారత స్థాయిలో మొదటి ర్యాంక్ కైవసం చేసుకుంది. అంకిత అగర్వాల్... రెండో ర్యాంక్, గామిని సింగ్లా... మూడో ర్యాంక్, ఐశ్వర్య వర్మ... నాలుగో ర్యాంక్ సాధించారు. ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ రౌండ్స్ తర్వాత యూపీఎస్సీ తుది ఫలితాలను విడుదల చేసింది. మెయిన్స్ ఫలితాలను మార్చి 17న యూపీఎస్సీ ప్రకటించింది. ఆ తర్వాత ఏప్రిల్ 5 నుంచి మే 26 వరకు ఇంటర్వ్యూలు (పర్సనాలిటీ టెస్ట్)

- మిగతా 2 లో

ఇదీ లోకం!



మూడేళ్లలో 95 శాతం

హామీలు నెరవేర్చాం

భవిష్యత్‌లో మరింత సేవ చేస్తా: సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:

మూడేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలకు 95శాతం హామీలు అమలు చేశానని, మరెన్నో మంచి పనులకు శ్రీకారం చుట్టానని సీఎం జగన్ అన్నాను. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటై మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజానీకాన్ని ఉద్దేశించి సోమవారం ట్వీట్ చేశారు. మీరు చూపిన ప్రేమ, అందించిన ఆశీస్సులతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి మూడేళ్లు అవుతోంది. మీరు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గడిచిన మూడేళ్లలో 95శాతానికి పైగా హామీలను అమలు చేశాం. ఎన్నో మంచి పనులకు శ్రీకారం చుట్టాం.రాబోయే రోజుల్లో మీకు మరింతగా సేవ చేస్తానని, మీ ప్రేమాభిమానాలు నాపై ఎప్పటికీ ఇలాగే ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. మీకు సేవ చేసే భాగ్యాన్ని నాకు కల్పించినందుకు మరొక్కసారి అందరికీ కృతజ్ఞతలు తెలియ జేసుకుంటున్నానని సీఎం జగన్ ట్వీట్ చేశారు.

ఇక విరామం లేని పోరాటాలు

- ప్రజల భవిష్యత్‌కు మహానాడుతో భరోసా
- రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్ రాజకీయాలకే అనర్హుడు
- టీడీపీ స్ట్రాటజీ కమిటీ సమావేశంలో చంద్రబాబు
- నెలకు రెండు జిల్లాలలో పర్యటిస్తానని వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:

ప్రభుత్వ అరాచక, విధ్వంస పాలనపై తిరుగుబాటుకు టీడీపీ మహానాడు వేదిక కాగా, రాష్ట్ర ప్రజల భవిష్యత్‌కు ఇదొక భరోసా ఇచ్చిందని టీడీపీ అధినేత చంద్రబాబు సోమవారం అన్నారు. ఒంగోలులో జరిగిన రెండు రోజుల మహానాడు ప్రజా విజయమని, ఈ స్ఫూర్తితో ఇకపై ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై విరామం లేని పోరాటాలు కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యకర్తలు, అభిమా నులు, ప్రజల భాగస్వామ్యంతో ఈ స్థాయి విజయం సాధ్యమైందని చంద్ర బాబు కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో ఎన్టీఆర్ హయాంలో ఎప్పుడో ఈ స్థాయిలో మహానాడు జరిగేదని, ఇప్పుడు మళ్లీ ఆ స్థాయిలో మహానాడు జరిగిందని చంద్రబాబు అన్నారు. క్యాడర్‌లో వచ్చిన జోష్, ప్రజల నుంచి వస్తున్న స్పందనను దృష్టిలో పెట్టుకుని తదుపరి కార్యక్రమాలు ఉండాలని చంద్రబాబు నేతలతో అన్నారు. మహానాడు వేదికగా ప్రకటించినట్లు ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలలో భాగంగా నెలకు రెండు జిల్లాలలో తాను పర్యటిస్తానని తెలిపారు. ఇప్పటికే మొదలు పెట్టిన బాదుడే బాదుడు కార్యక్రమం కొనసాగించాలని

- మిగతా 2 లో

కొత్తవీరాపురంలో

సాంఘిక బహిష్కరణ

విశాలాంధ్ర-తొట్టంబేడు:

'అధికారం' వెర్రి తలలు చాస్తోంది. ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు బనాయించడంతో పాటు భౌతిక దాడులకు దిగుతున్నారు. ఇదో రకమైన వ్యూహం. ప్రశ్నించే వారిపై కొత్త విధానాలు అమలు చేస్తున్నారు. అదే చాలా పురాతన కాలంలో ఉండే సాంఘిక బహిష్కరణ. వివరాల్లోకి వెళితే... తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం కొత్తవీరాపురంలో రెండు రోజుల కిందట మద్యం అమ్మకాల కోసం వేలం పాట పెట్టారు. ముగ్గురు వ్యక్తులు కలసి రూ.75 వేలకు పాట పాడారు. వారు ముగ్గురు కలసి కొత్తవీరాపురంలో మద్యం అమ్ముకోవడానికి ఈ హక్కు అన్నమాట. అయితే అదే గ్రామానికి చెందిన ఆర్కాడు మునిక్రిష్ణారెడ్డి అనే రైతు ఈ విధానాన్ని వ్యతిరేకించారు. గ్రామంలో మద్యం అమ్మకూడదని తెగేసి చెప్పారు. దీంతో ఆ

వెలిపై చాటింపు

- మిగతా 2 లో

విమాన ప్రమాదంలో ప్రయాణీకులంతా మృతి

ఖాట్మండు: గమ్యస్థానానికి చేరుకోవాల్సింది అరగంటలోపే..నేపాల్ తారా ఎయిర్‌లైన్స్ విమానం కుప్పకూలింది. నింగికి ఎగసిన పావుగంటకే జాడ లేకుండా పోయింది. విషాదాంతంగా ముగిసిన నేపాల్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రమాదంలో 14 మంది ప్రయాణికుల మృతదేహాలు పూర్తిగా కాలిన స్థితిలో లభ్యం అయ్యాయి. ఘటన సమయంలో విమానంలో 22 మంది ప్రయాణీకులు, సిబ్బందిఉన్నారు. వీరిలో నలుగురు భారత్‌లోని మహారాష్ట్రకు చెందినవారు. ప్రయాణికుల బంధువుల రోదనలు మిన్నంటాయి. ప్రమాదంలో శకలాలను సోమవారం ఉదయం గుర్తించారు. ప్రయాణికుల మృతదేహాలు కాలిపోయాయని, కొన్ని మృతదేహాలు అసలు గుర్తుపట్టలేనంతగా ఉన్నాయని పోలీసులు చెప్తున్నారు. నేపాల్ ఆర్మీ, రెస్క్యూ ట్రూప్స్‌తో కలిసి చేపట్టిన ఆపరేషన్ ఆదివారం సాయంత్రం మంచు వర్షం కారణంగా సోమవారం ఉదయం సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించిన కాసేపటికే మనపతీ హిమాల్ కొండచరియల దగ్గర శకలాలను గుర్తించారు. ముస్తాంగ్ జిల్లా కోవాంగ్ గ్రామ శివారులో ఈ తేలికపాటి విమానం ప్రమాదానికి గురైంది.సోమవారం ఉదయం సానోస్వేర్ వద్ద తగలబడుతున్న శకలాలు కనిపించాయని అధికారులు వెల్లడించారు. చనిపోయిన వాళ్లలో నేపాలీలతో పాటు నలుగురు భారతీయులు ఒకే కుటుంబానికి చెందిన వాళ్లని, వాళ్ల స్వస్థలం మహారాష్ట్ర థానే అని పేర్కొన్నారు.

నాటోపై స్పెయిన్, గ్రీస్, టర్కీల్లో నిరసన

మాడ్రిడ్: "సామ్రాజ్యవాద దేశాల యుద్ధాలు మా శవాల కోసమే" నని స్పెయిన్, గ్రీస్, టర్కీకి చెందిన కమ్యూనిస్ట్ పార్టీలు నినదించారు. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో నాటో వ్యతిరేక కార్యక్రమాన్ని మే 28న భారీ ఎత్తున చేపట్టాయి. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ వర్కర్స్ ఆఫ్ స్పెయిన్ (పీసీటీఈ) నిర్వహించిన ఈ రాజకీయ కార్యక్రమంలో నాటో సామ్రాజ్యవాద దేశాల యుద్ధ కుతంత్రాలకు వ్యతిరేకంగా గళ మెత్తారు. సెంట్రో కల్చరల్ ఎల్ మాడ్రోనోలో జరిగిన ఈ సమావేశంలో నాటో యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా గళమెత్తాయి. సామ్రాజ్యవాద సంస్థ దేశాల నుండి తమను విడిచిపెట్టారని డిమాండ్ చేశారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ గ్రీస్ (కేకేఈ), కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ టర్కీ (టీకేపీ) ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఆయా పార్టీల తరపున ప్రసంగించారు. కేకేఈ ఎంపీ, పొలిటికల్ బ్యూరో సభ్యుడు గియోర్గోస్ మారినోస్ ఈసమావేశానికి ప్రాతినిధ్యం వహించగా, టీకేపీ సెంట్రల్ కమిటీ సభ్యుడు, అంతర్జాతీయ వ్యవహా రాలకు సంబంధించి ఎకిన్ సోజ్మెజ్ ప్రాతినిధ్యం వహించారు. పీసీటీఈ జనరల్ సెక్రటరీ అస్టర్ గార్సియా, యువ కమ్యూనిస్టుల (సీజేసీ) జనరల్ సెక్రటరీ జేవియర్ మార్టిన్ కూడా ప్రసంగించారు. జూలై చివరలో మాడ్రిడ్‌లో జరగనున్న నాటో సమ్మిట్‌లో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలకు, కార్యకలాపాలకు కమ్యూనిస్ట్ పార్టీ సిద్ధంగాఉన్నట్లు గార్సియా పేర్కొన్నారు. స్పెయిన్‌లో నాటో స్థావరాలకు వ్యతిరేకంగా, ఉక్రెయిన్‌లో మోహరించిన నాటో దళాలను తిరిగి రావాలని, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పిలుపునిచ్చారు.

యుద్ధాన్ని ముగించాలి:

రష్యా: ప్రిమోరీ ప్రాంతంలోని కమ్యూనిస్ట్ పార్టీ ప్రతినిధులు ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించాలని డిమాండ్ చేశారు. తమ పార్టీ అధికారిక విధానాన్ని ధిక్కరిస్తూ, రష్యాలోని తూర్పు ప్రిమోరీ ప్రాంతంలోని ఇద్దరు కమ్యూనిస్ట్ చట్టసభ సభ్యులు శుక్రవారం ఉక్రెయిన్‌లో సామ్రాజ్యవాద యుద్ధంపై తమ అసమ్మతిని వ్యక్తం చేశారు.ఉక్రెయిన్ నుండి రష్యన్ దళాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ రష్యన్ ఫెడరేషన్ (సీపీఆర్ఎఫ్) సభ్యుడు వాసుకేవిచ్, ఉక్రెయిన్‌లో రష్యా మూడు నెలలుగా యుద్ధాన్ని కొనసాగించడం వలన సైనిక మరణాలు పెరుగుదలకు దారి తీస్తుందన్నారు. దేశానికి ఉపయోగపడే యువత వికలాంగులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

హాంకాంగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌తో జిన్‌పింగ్ భేటీ

బీజింగ్ : హాంకాంగ్ స్పెషల్ అడ్మిని స్ట్రేటివ్ రీజియన్ (హెచ్‌కెఎస్ఎఆర్)కి కొత్తగా నియమితులైన చీఫ్ ఎగ్జిక్యూ టివ్ జాన్ లీతో అధ్యక్షుడు జిన్‌పింగ్ సోమ వారం బీజింగ్‌లో సమావేశమయ్యారు. మే 8న జరిగిన చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఎన్నికల్లో గెలిచిన లీ, జూలై 1, 2022న పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎన్నికలలో విజయం సాధించినందుకు జిన్‌పింగ్ లీని అభినం దించారు. బాధ్యతలను స్వీకరించ డానికి సిద్ధంగా ఉన్నందుకు, తన విధులను చురుకుగా నిర్వర్తిస్తు న్నందుకు లీని ప్రశంసిస్తూ, జాతీయ భద్రత, హాంకాంగ్ శ్రేయస్సు, స్థిరత్వాన్ని పరిరక్షించడంలో లీ కృషి చేశారని జిన్ పింగ్ కొనియాడారు. కొత్త ఎన్నికల విధానంలో, హాంకాంగ్ గత సంవత్సరం నుండి ఎన్నికల కమిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఎన్నికలను విజయ వంతంగా నిర్వహించింది. సమాజంలోని అన్ని రం గాలు కలిసి పనిచేసే మంచి వాతావర ణాన్ని కల్పించడంలో కొత్త ఎన్నికల వ్యవస్థ నిర్ణయాత్మక పాత్ర పోషించిందని జిన్‌పింగ్ పేర్కొన్నారు. 'ఇది రాజకీయ, ప్రజాస్వామ్య వ్యవస్థ, ఇది 'ఒక దేశం, రెండు వ్యవస్థలు' సూత్రానికి అనుగుణంగా ఉంటుందని జిన్ పింగ్ అన్నారు. 'హాంకాంగ్‌లో 'ఒక దేశం, రెండు వ్యవస్థలు' సాధన అద్భుతమైన విజయాన్ని సాధించింది' అన్నారు.

విశాఖపట్నం కలెక్టరేట్ దగ్గర ధర్నా చేస్తున్న వామపక్ష కార్యకర్తలు

సత్యసాయి జిల్లాలో కేవీవీ ప్రసాద్, వేమయ్య తదితరుల అరెస్టు

అమ్మాయిలదే అగ్రస్థానం

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించింది. మెయిన్స్, ఇంటర్వ్యూ మార్కులతో సివిల్స్ తుది విజేతలను ప్రకటించింది. శృతి శర్మ విషయానికి వస్తే ఆమె ఉత్తరప్రదేశ్‌లోని బిజ్నోర్‌కు చెందినవారు. ఆమె హిస్టరీ స్టూడెంట్. సెయింట్ దిల్లీ యూనివర్సిటీ ఆధ్వర్యం లోని స్టీఫెన్స్ కాలేజ్ నుంచి పట్టభద్రుల య్యారు. జవహర్‌లాల్ నెహ్రూ యూని వర్సిటీ (జేఎన్‌యూ)లో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఆమె యూపీఎస్సీ సీఎస్‌ఈ పరీక్షల కోసం చాలా కాలంగా శిక్షణ పొందు తున్నారు. జామియా మిలియా ఇస్లామియా రెసిడెన్షియల్ కోచింగ్ అకాడమీలో సివిల్ సర్వీసెస్ పరీక్షకు శిక్షణ తీసుకున్నారు. ఇక రెండో ర్యాంకు సాధించిన అంకిత అగర్వాల్... దిల్లీ యూనివర్సిటీ నుంచి అర్థశాస్త్రంలో పట్టభద్రులయ్యారు. మూడో ర్యాంకు సాధించిన కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ పూర్తి చేశారు. మొదటి 25 స్థానాల్లో 15 మంది పురుషులు కాగా 10 మంది మహిళలు ఉన్నారు. ఈసారి అఖిల భారత సర్వీసులకు మొత్తం 685 మంది ఎంపిక కాగా.. జనరల్ కోటాలో 244 మంది, ఈడబ్ల్యూఎస్ నుంచి 73, ఓబీసీ 203, ఎస్సీ 105, ఎస్టీ విభాగం నుంచి 60 మంది ఉన్నారు. పోస్టుల వారీగా చూస్తే ఐఏఎస్‌కు 180, ఐపీఎస్‌కు 200, ఐఎఫ్ఎస్‌కు 37 మంది ఎంపికయ్యారు. ఇక సెంట్రల్ సర్వీసెస్ గ్రూప్ ఏ కేటగిరీకి 242 మంది ఎంపిక కాగా.. మరో 90 మంది గ్రూప్ బీ సర్వీసులకు ఎంపికైనట్లు యూపీఎస్సీ ప్రకటించింది.

టాపర్ అవుతానని అనుకోలేదు: శృతి

సివిల్స్ టాపర్‌గా నిలిచిన శృతి శర్మ మాట్లాడుతూ... యూపీఎస్సీ పరీక్షలో అర్హత సాధిస్తానని తనకు నమ్మకం ఉంది... అయితే మెరిట్ జాబితాలో అగ్రస్థానంలో ఉండటం ఆశ్చర్యం కలిగించిందని చెప్పారు. ఇండియన్ అడ్మినిస్ట్రేషన్ సర్వీసెస్ (ఐఏఎస్)లో చేరి దేశానికి సేవ చేయాలని కోరుకుంటు న్నానని ఆమె తెలిపారు. తనకు ఎంతగానో సహకరించిన తల్లిదండ్రులు, స్నేహితులు, ప్రతి ఒక్కరికీ ఈ విజయం దక్కుతుందని చెప్పారు.

మొదటి పది ర్యాంకర్లు వీరే... శ్రుతి శర్మ (1), అంకిత అగర్వాల్ (2), గామిని సింగ్లా (3), ఐశ్వర్య వర్మ (4), ఉత్కర్ష్ ద్వివేది (5), యక్ష్ చౌదరి (6), సమ్యక్ ఎస్ జైన్ (7), ఇషిత రాథీ (8), ప్రీతమ్ కుమార్ (9), హర్ కీరత్ సింగ్ రంధావా (10).

తెలుగు విద్యార్థుల సత్తా: మరోవైపు సివిల్స్ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు సత్తా చాటారు. యశ్వంత్‌కుమార్‌రెడ్డికి 15వ ర్యాంకు రాగా.. పూసపాటి సాహిత్య (24), భరద్వాజ్ (28), కొప్పిశెట్టి కిరణ్మయి (56), శ్రీపూజ (62), గడ్డం సుధీర్‌కుమార్‌రెడ్డి (69), ఆకునూరి నరేశ్ (117), అరుగుల స్నేహ (136), బి.చైతన్యరెడ్డి (161), ఎస్.కమలేశ్వరరావు (297), విద్యామరి శ్రీధర్ (336), దిబ్బడ ఎస్వీ అశోక్ (350), గుగులావత్ శరత్ నాయక్ (374), నల్లమోతు బాలకృష్ణ (420), ఉప్పులూరి చైతన్య (470), మన్యాల అనిరుధ్ (564), బిడ్డి అఖిల్ (566), రంజిత్‌కుమార్ (574), పాండు విల్సన్ (602), బాణావత్ అరవింద్ (623), బచ్చు స్మరణ్‌రాజ్ (676) ర్యాంకులు సాధించారు.

ప్రధాని అభినందన: సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ప్రధాని నరేంద్ర మోదీ ట్విట్టర్‌లో అభినందనలు తెలిపారు. '2021 సివిల్ సర్వీసెస్ (మెయిన్) పరీక్షలో ఉత్తీర్ణులైన వారందరికీ అభినందనలు. భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో ముఖ్యమైన సమయంలో పరిపాలనా వృత్తిని ప్రారంభిస్తున్న ఈ యువకులకు నా శుభాకాంక్షలు' అంటూ మోదీ ట్వీట్ చేశారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయిన వారిని ఉద్దేశించి మోదీ ఓదార్పు వ్యాఖ్యలు చేశారు. 'సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించలేకపోయిన వారి నిరాశను నేను పూర్తిగా అర్థం చేసుకున్నాను... అయితే వీరు తాము అనుసరించే ఏ రంగంలోనైనా ముద్ర వేయగల అత్యుత్తమ యువకులు అని కూడా నాకు తెలుసు. భారతదేశం గర్వపడేలా చేయండి. వారికి నా శుభాకాంక్షలు' అని పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా సివిల్స్ విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇక విరామం లేని పోరాటాలు

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ నేతలకు చంద్రబాబు సూచించారు. 'క్విట్ జగన్-సేవ్ అంధ్ర ప్రదేశ్' నినాదాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్‌కు రాజకీయాల్లో కొనసాగే అర్హత లేదని చంద్రబాబు మండి పడ్డారు. అసమర్థ పాలనతో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని, యువత భవిష్యత్ నిర్వీర్యం చేశారని, ఇలాంటి వాళ్లు రాజకీయాల్లో ఉంటే సమాజానికి నష్టం తప్ప ఎటువంటి లాభం ఉండ దన్నారు. కొత్త ఓట్ల నమోదు, ఓట్ల తొలగింపు వంటి అంశాల్లో నేతలు అప్రమత్తంగా ఉండాలని, మరోపక్క వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ప్రత్యేక ప్రణాళి కతో పని చేయాలని సూచించారు. మహానాడుకి ఊహించని స్థాయిలో జనం వచ్చినా నిర్వాహకులు కష్టపడి ఏర్పాట్లు చేశారని... సభను విజయవంతంగా నిర్వహించారని, అచ్చెన్నాయుడు, లోకేశ్‌తో సహా కింది స్థాయి వరకు పార్టీ నేతలు అంతా ఎంతో సమన్వయంతో పని చేశారని వారిని అభినందించారు. ముఖ్యంగా ప్రకాశం జిల్లా నేతల పని తీరును చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంసించారు. అంత పెద్ద కార్యక్రమం జరుగుతుంటే పోలీసు శాఖ కనీస మాత్రం సహకరించలేదని, అయినా ఎక్కడా కార్యక్రమం గాడి తప్పకుండా పార్టీ వాలంటీర్ల ద్వారానే సభను విజయవంతం చేశారని కొనియాడారు. తీవ్రస్థాయిలో ఎండలున్నా లెక్క చేయకుండా వచ్చిన లక్షల మంది కొత్త స్ఫూర్తిని నింపారని, మహానాడు సక్సెస్‌ను పార్టీ శ్రేణులతో పాటు ప్రజలు కూడా ఆస్వాదిస్తున్నారని నేతలు చంద్రబాబుకి వివరించారు.

కొత్తవీరాపురంలో సాంఘిక బహిష్కరణ

(మొదటిపేజీ తరువాయి)

గ్రామంలో కొంతమంది పెద్దలకు ఆగ్రహం వచ్చింది. మునిక్రిష్టారెడ్డితో గ్రామస్తులు ఎవరూ మాట్లాడకూడదని తీర్మానించారు. ఆయనతో మాట్లాడిన వారికి, కలసి పనికి వెళ్లిన వారికి రూ.3 వేలు జరిమానా వేస్తామని, చూసి చెప్పిన వారికి రూ. 1,000 బహుమతి అందిస్తామని సోమవారం రాత్రి దండోరా వేశారు. ఈ ఘటన కొత్తవీరాపురంలో సంచలనం కలిగించింది. ఈ సామాజిక వెలిపై అధికారులు స్పందించి విచారణ జరిపి, బాధితునికి న్యాయం చేయవలసి ఉంది.

ప్రజాగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

జీవితాన్ని చిందవందర చేశారని విమర్శించారు. అంబానీ, అదానీ వంటి కార్పొరేట్లపై ఒక శాతం పన్ను విధిస్తే దేశంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేయవచ్చని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. ఓబులేశు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు, సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, సీపీఐ ఎంఎల్ న్యూడెమ్రోక్రసీ నాయకులు పోలారి, రామకృష్ణ, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకుడు హరినాథ్, ఎంసీపీఐ(యు) నాయకుడు ఖాదర్‌బాషా, ఎస్‌యూసీఐ(సీ) నాయకుడు సుధీర్, సీపీఐ నగర సహాయ కార్యదర్శి జి.కోటేశ్వరరావు తదితరులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

కృష్ణాజిల్లాలో: కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు పెంచుకుంటూ పోతున్న పెట్రోల్ డీజిల్ గ్యాస్ నిత్యావసర సరుకులను తగ్గించే అంతవరకు ప్రజల పక్షాన నిలబడి పోరాడాల్సిన బాధ్యత మన అందరి పై ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు అక్కినేని వనజ, కృష్ణా జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు అన్నారు. మచిలీపట్నంలోని ధర్నా చౌక్ వద్ద వామపక్షాల ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. వనజ, నార్ల మాట్లాడుతూ ప్రజలపై భారాలు మోపడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మోదుమూడి రామారావు, సీపీఎం నగర కార్యదర్శి బూరా సుబ్రహ్మణ్యం, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి వీరబాబు, సీపీఐ నాయకులు కట్టా హేమసుందరరావు, యర్రంశెట్టి ఈశ్వరరావు, మల్లిపెద్ది రత్నకుమారి, మోదుమూడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పన్నులు తగ్గించకుంటే ఉద్యమం ఉధృతం:పీజే

కేంద్రంతో పోటీపడి ప్రజలపై భారాలు మోపుతున్న రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెంచిన పన్నులు తగ్గించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ కార్యదర్శివర్గసభ్యులు పీజే చంద్రశేఖర్‌రావు హెచ్చరించారు. ఒంగోలు కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్‌ల ప్రయోజనాలకు తలొగ్గి ప్రజల ప్రయోజనాలను విస్మరిం చిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయ కులు పూనాటి ఆంజనేయులు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ వెంకటరావు, పీవీఆర్ చౌదరి, ఎస్‌డి సర్దార్, సీపీఎం నాయకులు వై సిద్ధయ్య, జాలా అంజయ్య, , సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకులు ఎస్ లలితకుమారి, ఎంఎల్ న్యూడెమక్రసీ నాయకులు ఆర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కడపలో: అధిక ధరలు,పన్నుల భారాలపై కడప కలెక్టరేట్ ఎదుట జరిగిన వామపక్షాల ధర్నాలో సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పులి కృష్ణమూర్తి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి డబ్ల్యూ.రాము, ఆర్.ఎస్.పి జిల్లా కార్యదర్శి కె.సుబ్బరాయుడు, సిపిఐ మార్క్సిస్టు- లెనినిస్టు, లిబరేషన్ జిల్లా కార్యదర్శి రమణయ్య, సిపిఐ మార్క్సిస్టు- లెనినిస్టు, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.అంకన్న, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తిరుపతిలో: తిరుపతి కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నా కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టీ. జనార్ధన్, పి. మురళి, గురవయ్య, నదియా, నగర కార్యదర్శి విశ్వనాథ్, ఏఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నంలో: విశాఖ కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నా కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.జె.స్టాలిన్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ నర్సింగరావు, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఎం.లక్ష్మి, ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి కె.శంకరరావు, ఎస్‌యుసిఐ జిల్లా కార్యదర్శి ఎస్. గోవిందరాజులు, సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు ఎం పైడిరాజు, ఎం జగ్గునాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో: విజయనగరం కలెక్టర్ కార్యాల యం వద్ద జరిగిన ధర్నాలో సీపీఐ జిల్లా కార్యదర్శి రమణ, సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు, ఎస్ రంగరాజు, పొందూరు అప్పలరాజు, వెలగాడ రాజేష్, రాములు, కె.వి.రమణ ,ఎస్ సునీల్ ,బి వాసు సీపీఎం నాయకులు రెడ్డి శంకర్రావు, కె సురేష్, రమణమ్మ, టీవీ రమణ తదితర నేతలు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో: పెరిగిన ధరలను, పన్నుల భారాలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సనపల నర్సింహులు, కార్యవర్గ సభ్యులు చిక్కాల గోవిందరావు, జి.రాజేశ్వరరావు, రాష్ట్ర సమితి సభ్యులు వి.రామారావు, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకులు వి.భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో: కర్నూలు కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్య దర్శులు బి.గిడ్డయ్య, గౌస్‌దేశాయ్‌లు పాల్గొన్నారు.కలెక్టరేట్ ఎదుట ఆందోళనను దృష్టిలో పెట్టుకొని పోలీసులు ముందస్తుగా సీపీఐ, సీపీఎం నాయకులను గృహనిర్బంధం చేశారు. సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు పి రామచంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు నబీ రసూల్, పంపన్నగౌడ్, లక్ష్మిరెడ్డి, నాయకులు రాజాసాహెబ్, సుల్తాన్, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి జీ రంగన్న, సీపీఐ కృష్ణగిరి మండల కార్యదర్శి ఖలీల్, కోడుమూరు మండల కార్యదర్శి మాధవస్వామి, పెద్దకడుమూరు మండల కార్యదర్శి ఈరన్నతోపాటు సుమారు 200 మందిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. మరికొంత మందిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. నంద్యాల జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదుట పోలీసులకు సీపీఐ నాయకుల మధ్య వాగ్వివాదం చోటుచేసు కోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

శ్రీసత్యసాయి జిల్లాలో: పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సత్యసాయి జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసనను పోలీసులు అడ్డుకున్నారు. సోమవారం యనుమలపల్లి సర్కిల్ నుంచి ర్యాలీగా బయలుదేరిన సీపీఐ, సీపీఎం, న్యూ డెమోక్రసీ, ప్రజా సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేసి వాహనాలలో పుట్టపర్తి రూరల్, బుక్కపట్నం పోలీస్ స్టేషన్లకు తరలించారు. యనుమలపల్లి సర్కిల్ నుంచి కొంత మంది పోలీసుల నుంచి తప్పించుకుని కలెక్టరేట్ వద్దకు నినాదాలు చేస్తూ చేరుకున్నారు. అక్కడ పోలీసులు గేట్లు మూసివేసి కార్యకర్తలను అడ్డుకొని వాహనాల్లో పోలీస్ స్టేషన్లకు తరలించారు. అరెస్టయినవారిలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ జిల్లా కార్యదర్శి యం. వేమయ్య యాదవ్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటమయ్య ,సీపీఎం ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కృష్ణ, తదితరులు ఉన్నారు.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో

ఏలూరు జిల్లాలో కలెక్టరేట్ వద్ద ధర్నాలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్, సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఏలూరు ఏరియా కన్వీనర్ ఉప్పులూరి హేమ శంకర్, బత్తుల వెంకటేశ్వరరావు, రామాకుల లక్ష్మణ రావు, పొటేలు పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావును, సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజును, జిల్లా కౌన్సిల్ సభ్యులు మండల నాగేశ్వరరావును గృహనిర్బంధం చేశారు. భీమవరం కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ నెక్కంటి సుబ్బారావు, జిల్లా సహాయ కార్యదర్శి ఎం. సీతారాం ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లుబోయిన రంగారావు, నాయకులు కలిశెట్టి వెంకటరావు, ఎం. లక్ష్మీపతి, సనపల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాజమండ్రి, కాకినాడల్లో

రాజమండ్రిలో సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో వందలాది మంది పార్టీ శ్రేణులు ర్యాలీగా చేరుకొని కలెక్టరేట్‌ను ముట్టడించారు. గేటుకు అడ్డంగా ఆందోళన కారులు ధర్నా చేయడంతో లోపలికి వెళ్ళవలసిన జిల్లా అధికారులు కొద్దిసేపు బయట ఉండిపోయారు. ధర్నా నుద్దేశించి సీపీఐ జిల్లా కార్యదర్శి టి. మధు, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సీపీఐ (ఎంఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్. కిరణ్ కుమార్ ప్రసంగించారు. కాకినాడలో వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళనకారులు కలెక్టరేట్ ముట్టడించారు. కలెక్టరేట్ వైపునకు దూసుకురావడంతో పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆందోళనకారులు ఆగకుండా కలెక్టరేట్ గేటు వరకు వచ్చి ఆందోళన కొనసాగించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ కాకినాడ జిల్లా కార్యదర్శి ఎం. రాజశేఖర్, జె. వెంకటేశ్వర్లు, ఏగుపాటి అర్జునరావు, వి. చిట్టిబాబు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, లోవ రత్నం తదితరులు నాయకత్వం వహించారు.

మోదీ, జగన్‌లకు మూల్యం తప్పదు: ముప్పాళ్ల

నిత్యావసరాలతో సహా అన్ని రకాల ధరలు పెంచి,మరో పక్క పన్నుల భారం మోపుతూ ప్రజలను తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రధాని మోదీ, సీఎం జగన్‌లు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు హెచ్చరించారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో తలపెట్టిన కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు విజయవంతంగా జరిగాయి. పల్నాడు జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో ముప్పాళ్ల మాట్లాడారు. ఈకార్యక్రమంలో పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతివరప్రసాద్, సీపీఎం కార్యదర్శి విజయ్ కుమార్, సీపీఐ సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, ఎంసీపీఐ నాయకులు జి.రాంబాబు, సీపీఐ(ఎంఎల్) నాయకులు మణి, పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, పీకేఎస్ నాయకులు కొండలరావు తదితరులు పాల్గొనగా, గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, సీపీఎం కార్యదర్శి పాశం రామారావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వి.నరసింహారావు, సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకులు ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) రెడ్‌స్టార్ జిల్లా నాయకులు చెన్నకేశవులు, ఎంసీపీఐ(యు) జిల్లా నాయకులు కె.శ్రీధర్, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, ప్రజాపోరు నాయకులు రంగన్న, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి గనిరాజు తదితరులు పాల్గొన్నారు. బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.నాగాంజనేయులు, సీపీఎం నాయకులు సీహెచ్ గంగయ్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మేకల ప్రసాద్, బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ కాగిత కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ల బిగింపు యోచనను విరమించుకోవాలి: రావుల వెంకయ్య

మోదీ ప్రభుత్వానికి తందానా అంటూ వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు బిగించి తద్వారా ఉచిత విద్యుత్‌ను రద్దుచేయాలనే ఆలోచనతో రైతులపై పెనుభారం మోపేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని వెంటనే సీఎం జగన్ విరమించుకోవాలని ఏఐకేఎస్ అధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు రావుల వెంకయ్య డిమాండ్ చేశారు. నెల్లూరు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లాలో ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో ధర్నా కార్యక్రమాలు ప్రదర్శనలు నిర్వహిం చరాదని, తొలుత గాంధీ బొమ్మ వద్ద వామపక్ష నాయకులతో పోలీసులు వాగ్వాదానికి దిగారు. అయితే ఎన్నికలు జరుగుతున్నది కేవలం ఆత్మకూరు నియోజక వర్గంలో అని, ఇక్కడ ఎన్నికల ప్రచార సభలు నిర్వహించడం లేదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు శాంతియుతంగా తమ నిరసనను తెలియజేస్తుండగా, పోలీసులు అడ్డుకోవడం సిగ్గుచేటని నేతలు మండిపడ్డారు. ధర్నాలో సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, రైతు సంఘం నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, షాన్‌వాజ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సిరాజ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మస్తాన్, మున్నా, ఏఐటీయూసీ నాయకులు సురేష్, కృష్ణ మోహన్, సీపీఎంనాయకులు మూలం రమేష్, మాదాల వెంకటేశ్వర్లు, సీపీఐ (ఎంఎల్) నాయకులు సాగర్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జాస్తి కిషోర్‌బాబు, ఎస్‌యూసిఐ నాయకులు సురేష్, కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కళ్లుగప్పి అనంతపురం కలెక్టరేట్‌ను ముట్టడించిన జాఫర్

వామపక్షాల ఆందోళన కార్యక్రమాలను భగ్నం చేసేందుకు పోలీసులు అనంతపురం జిల్లావ్యాప్తంగా నాయకులను అరెస్ట్ చేశారు. అయినప్పటికీ పోలీసుల కళ్లగప్పి బురఖా వేషంలో కలెక్టరేట్‌ను ముట్టడించిన అనంతపురం జిల్లా సీపీఐ కార్యదర్శి జాఫర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టులతో ప్రజా ఉద్యమాలను అణచలేరని వామపక్ష నేతలు మండిపడ్డారు. జిల్లావ్యాప్తంగా31 మండలాల్లో వందలాది మంది పార్టీ శ్రేణులను పోలీసులు అరెస్ట్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి వి రాంభూపాల్ నగర కార్యదర్శి రామిరెడ్డి, సీపీఐ ఎం.ఎల్.ఎ నాయకులు పెద్దన్న చంద్రశేఖర్, నాగభూషణం, న్యూడెమోక్రసీ నాయకులు నాగరాజు, వీరనారప్పరాయుడు, ఎస్‌యూసీఐ రాఘవేంద్ర మహేష్ తదితరులను అరెస్టు చేశారు.

ప్రైవేటీకరణ దూకుడు

(మొదటిపేజీ తరువాయి)

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ప్రైవేటీకరణ జాబితాలో ఉన్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. ప్రక్రియ ప్రకారం, కేబినెట్ కార్యదర్శి నేతృత్వంలోని ప్రధాన కార్యదర్శుల బృందం, దాని ఆమోదం కోసం ప్రత్యామ్నాయ యంత్రాంగానికి (ఏఎం) పంపుతుంది. చివరికి తుది ఆమోదం కోసం ప్రధాన మంత్రి నేతృత్వంలోని కేబినెట్‌కు దాని సిఫార్సును పంపుతుంది. ప్రధాన కార్యదర్శుల బృందంలో ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి, రెవెన్యూ కార్యదర్శి, వ్యయ కార్యదర్శి, కార్పొరేట్ వ్యవహారాల కార్యదర్శి, న్యాయ వ్యవహారాల కార్యదర్శి, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ కార్యదర్శి, పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ (దీపమ్) కార్యదర్శి, పరిపాలనా విభాగం కార్యదర్శి ఉన్నారు.

ప్రజా సాంస్కృతిక విధానం కోసం పోరు

(మొదటిపేజీ తరువాయి)

మహాసభ తీర్మానించిందని చెప్పారు. ప్రజా సాంస్కృతిక వ్యవస్థను విధ్వంసం చేస్తూ నియంతృత్వం పోకడలతో వ్యవహరిస్తున్న పాలక తీరుపై ఐక్య పోరాటాలు చేసే విధంగా ప్రజలను మేల్కొలపడంలో ప్రజా నాట్యమండలి ముందుంటుందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం సాంస్కృతిక రంగాన్ని పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేస్తోందనీ, ఆ శాఖకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించాలని కోరారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన కళాకారులు ఐదు రోజుల పాటు ప్రదర్శించిన నాటకాలు, నాటికలు జానపద కళారూపాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. విలేకరుల సమావేశంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర కోశాధికారి ఆర్. పిచ్చయ్య, మహాసభల ఆహ్వాన సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి పి. చంద్రశేఖర్, వి.అమర్, జి. ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చంద్రానాయక్, పెంచలయ్య

మహాసభ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. చీఫ్ ప్యాట్రన్‌గా నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న), అధ్యక్షులుగా పి.చంద్రా నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాబ్జి, ప్రధాన కార్యదర్శిగా చిన్నం పెంచలయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆర్. రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా మహంతి లక్ష్మణరావు, ఎస్. గుర్రప్ప, శివయ్య, నాగరాజు, కార్యదర్శు లుగా గని, నజీర్, ఆరేటి రామారావు, అమర్, లక్ష్మీనారాయణ, కోశాధికారిగా ఆర్. పిచ్చయ్య తో పాటు 24 మంది కార్యవర్గ సభ్యులు వారితో కలిపి 61 మంది కౌన్సిల్ సభ్యులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది.

రాజమండ్రి, విశాఖలో నేడు 'గరీబ్ కల్యాణ్ సమ్మేళన్'

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలో ప్రధానమంత్రి మోదీ గరీబ్ కల్యాణ్ సమ్మేళన్ కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ప్రత్యక్షంగా లబ్దిదారులతో సంభాషిస్తారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే ఈ జాతీయ స్థాయి కార్యక్రమంలో కేంద్రం అమలు చేస్తున్న 16 పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న లబ్ధిదారులతో ఆయన ముచ్చటిస్తారు. రాష్ట్రానికి సంబంధించి విశాఖపట్నం, రాజమండ్రిలో దీనిని నిర్వహి స్తారు. విశాఖపట్నం కళావాణి ఆడిటోరియం (పోర్టు ట్రస్టు)లో 31వ తేదీ ఉదయం 9గంటల నుంచి ఈ కార్యక్రమం కొనసాగుతుంది. కేంద్ర ఓడరేవులమంత్రి సర్బానంద సోనోవాల్, కేంద్ర మాజీ మంత్రి సురేశ్ పాల్గొంటారు. రాజమండ్రికి సంబంధించి సెంట్రల్ జైల్ రోడ్‌లోని మంజీరా సరోవర్ ప్రీమియర్‌లో నిర్వహిస్తారు.

ధర లేక బొప్పాయి పంట దున్నేసిన రైతులు

విశాలాంధ్ర-చాగలమర్రి: బొప్పాయి ధరలు పడిపోయి, పెట్టుబడులు కూడా రాక రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. ఏంచేయా లో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. సోమవారం నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం లోని చిన్నవంగలి గ్రామంలో రైతులు బొప్పాయి పై ఆశను వదులుకొని డోజర్లతో దున్నేశారు. గ్రామానికి చెందిన చంద్ర ఓబులరెడ్డి, వెంకటేశ్వ రరెడ్డి, వెంకటరెడ్డిలతో పాటు మరో ఐదు మంది రైతులు సుమారు 50 ఎకరాల దాకా బొప్పాయి తోటలను దున్నేశారు. ధర లేక పోవడంతో పాటు దిగుబడులు కూడా ఆశించినంత లేక పోవడంతో పంటలను దున్నేసి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. గత ఏడాది బొప్పాయి టన్ను రూ.15 వేలు పలకగా, ఈ ఏడాది రూ.6 వేలు మాత్రమే పలుకుతుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

దళితులు సంఘటితం కావాలి

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎస్సీలకు ఇచ్చే 28 పథకాలు రద్దు చేశారని మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పీజే చంద్రశేఖరరావు విమర్శిం చారు. సోమవారం ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నిర్మాణ సభకు తిరుమలయ్య, గద్దల బాల కోటయ్య, పందిటి మోహన్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్సీ పీజే తొలుత డీహెచ్‌పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ... దళితులు పోరాడి సాధించుకున్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని రాష్ట్రంలో సక్రమంగా అమలు చేయడం లేదని, 41ఏ నోటీసులు ఇచ్చి ముద్దాయి లకు స్టేషన్ బెయిల్ ఇస్తున్నారని, కుల వివక్షకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలంటే దళితులు ఉద్యమం చేయాల్సిన పరిస్థితి ఈ ప్రభుత్వం దళితులకు కల్పిం చిందని విమర్శిం చారు. అన్ని రాజకీయ పార్టీలు దళితులపై మొసలి కన్నీరు కార్చి దళితుల ఓట్లతో రాజ్యాధికారం సాధిస్తు న్నారని ఇకనైనా దళితులు మేల్కొని సంఘ టితం కావాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న దళితులందరికీ దళిత హక్కుల పోరాట సమితి అండగా ఉంటుందని, ప్రతి ఒక్క దళితుడూ సమితిలో సభ్యులుగా చేరాలని సూచించారు. ఇటీవల కాలంలో మరణించిన దళిత నాయకులకు, అభ్యుదయ వాదు లకు మహా సభ సంతాపం తెలిపింది. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కరవది

మహాసభలో మాట్లాడుతున్న పీజే చంద్రశేఖరరావు. వేదికపై కరవది, బాలకోటయ్య, తిరుమలయ్య తదితరులు

సుబ్బారావు మాట్లా డుతూ... సీఎం వైఎస్ జగన్... దళితులకు మంత్రి పదవులు ఇచ్చి సామాజిక న్యాయం పాటిస్తున్నానని అంటు న్నారని, ఒక హోమ్ గార్డును కూడా మార్చలేని హోంశాఖ మంత్రి పదవి దళితుల కెందుకని అన్నారు. పదవులు ఇచ్చి పవర్ ఇవ్వకుండా దళితులకు సామా జిక న్యాయం చేస్తామని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ అనంత బాబు, తన కారు డ్రైవర్ అయిన దళితుడిని హత్యచేసి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు... ఇటువంటి దళిత వ్యతిరేక పార్టీకి తెలియక దళితులు ఎగబడి ఓట్లు వేశారని అన్నారు. ఇప్పటికైనా దళితులు మేల్కొని జాగ్రత్త వహించాలని కోరారు. తదనంతరం ముప్పైఐదు మంది జిల్లా కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా పూరకంటి తిరుమల రావు, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, అరుణ, నాగార్జున, ప్రధాన కార్యదర్శిగా పందిటి మోహన్, సహాయ కార్యదర్శులుగా హరి, అంజ య్య, మహీంద్ర, ట్రెజరర్‌గా గద్దల బాల కోటయ్యను ఎన్నుకున్నారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అర్ వెంకట్రావు, ఐయల్‌పి పార్టీ నాయకుడు దాసరి సుందరం, ప్రజా నాట్య మండలి నాయకుడు ముత్తన అంజయ్య, జిల్లా నలుమూలల నుంచి దళిత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవిలోనే ఉపాధ్యాయుల బదిలీలు: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న రెండు లక్షల మంది ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూలును వేసవి సెలవుల్లోనే బోధనకు ఇబ్బంది లేకుండా వెంటనే ప్రకటించాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న డిమాండ్ చేశారు. విజయవాడ ఎస్టీయూ రాష్ట్ర సంఘ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయిశ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం కార్యనిర్వాహక వర్గ సమావేశం జరిగింది. నేతలు మాట్లాడుతూ, జిల్లాల పునర్విభజన నేపథ్యంలో సొంత జిల్లాలకు వెళ్లేందుకు వీలుగా, జీరో సర్వీసుతో బదిలీలకు అనుమతించాలని కోరారు. పాఠశాలల హేతుబద్ధీకరణలో తీవ్ర అసమానతలున్నాయని, దీని వలన విద్యార్థులు టీచర్లు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లోపభూయిష్టమైన నూతన జాతీయ విద్యా విధానం యధాతథంగా అమలు ద్వారా బడుగు బలహీన వర్గాలకు విద్యను దూరం చేసే విధానాలు విడనాడాలన్నారు. డీఎస్సీ నియామకాలు చేపట్టకుండా టీచర్లపై విపరీతమైన బోధన, బోధనేతర పనుల భారం మోపడం సరికాదన్నారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణే తమ ఏకైక లక్ష్యమని, ఇందుకు భిన్నంగా జీపీఎస్ విధానంపై చర్చించేందుకు తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు. అత్యవసర సమయాల్లో అక్కరకొస్తుందని జీతాల నుంచి పొదుపు చేసిన పీఎఫ్, ఏపీజీఎల్ఐ సొమ్ము నుంచి రుణాలు, తుది మొత్తాల మంజూరులో తీవ్ర జాప్యం జరగడం అన్యాయమన్నారు. నాడు-నేడు విధులు నిర్వర్తించే టీచర్లకు ఒత్తిళ్ళు, ఇబ్బందులు నివారించాలని, సంపాదిత సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఆదర్శ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ పాఠశాలల టీచర్లకు 010 పద్దు క్రింద వేతనాలు చెల్లించాలని, కస్తూర్బా విద్యాలయాల సిబ్బందికి మినిమం టైమ్ స్కేలు అమలు చేయాలని డిమాండు చేశారు. స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. పర్యవేక్షణాధికారుల పోస్టులను సీనియర్ హెచ్‌ఎంలతో భర్తీ చేయాలని, వేసవి సెలవుల్లోనూ , వ్యక్తిగత జీవితాన్ని కూడా ఒత్తిడికి గురి చేసేలా బలవంతపు కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. వాటితో పాటు వివిధ సమస్యలపై ఉద్యమ కార్యాచరణ రూపొందించుకుంటామని ఉద్యమాలకు వెనుకాడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పాధ్యాయవాణి ప్రధాన సంపాదకులు గాజుల నాగేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షులు గంటా మోహన్, వై.సుబ్రమణ్యంరాజు, దొరబాబు, ఎర్రయ్య, రామచంద్రయ్య, చంద్రశేఖర్, శ్రీనివాస్, అదనపు ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్, బాలగంగిరెడ్డి, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు వేతనాలు పెంచాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేశు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న గోరుముద్ద పథకంలో పనిచేస్తున్న మహిళ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలుగా పెంచి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేశు డిమాండ్ చేశారు. మంగళవారం గొల్లపూడి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. దీనికి రాష్ట్ర అధ్యక్షులు ప్రవంతి అధ్యక్షత వహించారు. ఓబులేశు మాట్లాడుతూ రాష్ట్రంలో అసంఘటిత రంగంలో పనిచేస్తున్న మహిళా కార్మికుల సంక్షేమన్ని విస్మరిస్తోందనీ, వారికి వేతనాలు పెంచకుండా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. తక్షణమే మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనం 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత లేక వారి జీవితాలు అగమ్య గోచరంగా మారాయని, రోజు రోజుకూ నిత్యావసర, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య గౌరవ వేతనం తీసుకునే కార్మికుల పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. కార్మికులకు సామజిక భద్రత చట్టం అమలు చేసి పదవీ విరమణ ప్రయోజనాలు, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌బాబు మాట్లాడుతూ, గత 18 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులు ఇంకా మూడు నెలల గౌరవ వేతనంతో పనిచేయడం దారుణమన్నారు. ఎక్కడా లేని తరహాగా, జగనన్న గోరుముద్ద పథకాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నారన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పనిచేసే చోట మౌలిక వసతులు కల్పించాలని, నూతన మెనూ అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కరం కోసం రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధమవు తు న్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఆఫీస్ బేరర్లు శైలజ, సురేంద్ర, రాష్ట్ర సమితి నాయకులు మేరీ, త్యాగరాజ్, రమాదేవి, షాహినా, గోవిందరాజులు, అను రాధ, వెంకటరమణ, సులోచన, లక్ష్మీపార్వతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఓబులేశు. పక్కన శైలజ, మేరీ, సురేంద్ర, త్యాగరాజ్ తదితరులు

విద్యుత్ ఉద్యోగులను మోసం చేసిన ప్రభుత్వం

విద్యుత్ ఉద్యోగులకు ప్రభుత్వం మోసగిస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేశు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, విద్యుత్ సంస్థల్లో దాదాపుగా 4500మంది పైచిలుకు ఉద్యోగులకు ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ గా మార్చు చేయాలని, 1/2/ 1999, 2004 మధ్య చేరిన ఉద్యోగు లందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని, అప్పటి యాజ మాన్యం, ప్రభుత్వానికి చాలా సార్లు విన్నవించినప్పటికీ స్పందన లేదన్నారు. జగన్ ఎన్నికల కంటే ముందు విద్యుత్ ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని వారి ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా హామీ ఇచ్చారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తొలి రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో భేటీ అనంతరం సీపీఎస్ వారం రోజుల్లో రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తానని జగన్ ప్రకటించారని గుర్తుచేశారు. ఆ తర్వాత సీపీఎస్ రద్దు చేసి, పెన్షన్ సౌకర్యం కల్పించడం అసాధ్యమని సీఎం వ్యాఖ్యానించడాన్ని తప్పుపట్టారు. ఆయనకు సీపీఎస్‌పై అవగాహన లేదన్నారు. పెన్షన్ సౌకర్యం కల్పించడం సాధ్యం కాదని ప్రభుత్వ సలహా దారులు సజ్జల రామకృష్ణ రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విద్యుత్ ఉద్యోగులకు జగన్ ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండు చేశారు.

సివిల్స్ విజేతలకు గవర్నర్, సీఎం అభినందన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సివిల్స్‌లో ర్యాంకులు సాధించిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో 685 మంది అభ్యర్థులు ర్యాంకులు సాధించగా, దాదాపు పది మంది తెలుగు రాష్ట్రాల నుండి ఉండటం శుభ పరిణామమన్నారు. యూపీపీఎస్సీ సివిల్స్ సర్వీసెస్-2021 ఫలితా లను సోమవారం విడుదల చేసింది. 15వ ర్యాంక్ సాధించిన యశ్వంత్ కుమార్‌రెడ్డితో పాటు తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు పి.సాహిత్య, శ్రుతి రాజ్యలక్ష్మి, రవికుమార్, కె.కిరణ్మయి, పాణి గ్రాహికార్తీక్, జి.సుధీర్ కుమార్‌రెడ్డి, శైలజ, శివానందం, ఏ.నరేష్‌ను వారు అభినందించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన యశ్వంత్‌కుమార్‌రెడ్డికి 15వ ర్యాంక్ దక్కింది. పూసపాటి సాహిత్యకు జాతీయ స్థాయిలో 24వ ర్యాంక్, శృతి రాజ్యలక్ష్మికి 25వ ర్యాంక్, రవికుమార్‌కు 38వ ర్యాంక్, కొప్పిశెట్టి కిర్మణయికి 56వ ర్యాంక్ దక్కింది. పాణిగ్రహి కార్తీక్‌కు 63వ ర్యాంక్, గద్దం సుధీర్‌కుమార్‌కు 69వ ర్యాంక్, శైలజ 83వ ర్యాంక్, శివానందం 87వ ర్యాంక్, ఆకునూరి నరేష్‌కు 117వ ర్యాంక్, అరుగుల స్నేహకు 136వ ర్యాంక్, గడిగె వినయ్‌కుమార్ 151 ర్యాంక్, దివ్యాన్షు శుక్లాకు 153వ ర్యాంక్, కన్నెధార మనోజ్ కుమార్‌కు 157వ ర్యాంక్, బొక్కా చైతన్యరెడ్డికి 161వ ర్యాంక్, దొంతుల జీనత్ చంద్రకు 201వ ర్యాంక్, అకవరం సాస్యరెడ్డికి సివిల్స్ జాతీయ స్థాయిలో 214వ ర్యాంక్ దక్కాయి.

సామాజిక వర్గాలకు చంద్రబాబు దూరం: విజయసాయిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సామాజిక వర్గాలను వదిలేసి, సామాజిక మాధ్యమాలపైనే ఆధారపడ్డారని వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ వి.విజయసాయిరెడ్డి విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి విజయసాయిరెడ్డి, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, పార్టీ ముఖ్య నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తల హర్షధ్వానాల మధ్య కేక్ కట్ చేశారు. అంతకుముందు బుల్లెట్ బైక్‌పై విజయసాయిరెడ్డి కార్యకర్తలతోపాటు పార్టీ కేంద్ర కార్యాలయానికి ర్యాలీగా వచ్చారు. విజయసాయిరెడ్డి మాట్లాడుతూ, జగన్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను 95శాతం నెరవేర్చిందన్నారు. సామాజిక న్యాయ పాలన అందించిన ప్రభుత్వమిది అనీ, 70శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, పేద వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చి లబ్ధి చేకూర్చిందన్నారు. పరిపాలనా సంస్కరణలు అమలు చేసిన ప్రభుత్వం. చంద్రబాబు 14 ఏళ్లల్లో సాధించలేనిది, వైసీపీ ప్రభుత్వం మూడేళ్లలో సాధించిందన్నారు. టీడీపీ తొడల పార్టీగా మారిందని, చంద్రబాబు బూతుల నాయుడుగా మారిపోయారని విజయసాయిరెడ్డి ఎద్దేవాచేశారు. మోపిదేవి వెంకట రమణ మాట్లాడుతూ, సామాజిక న్యాయానికి నిజమైన అర్థం జగన్ చెప్పారన్నారు. అంబేద్కర్ కన్నకలలకు అనుగుణంగా ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్‌లో అమలు అవుతున్నాయని చెప్పారు. ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలే కాకుండా, ఇవ్వని హామీలనూ అమలు చేస్తూ ప్రజలంతా సంతోషంగా ఉండాలనే ఏకైక లక్ష్యంతో సీఎం పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్యవరప్రసాద్, మురుగుడు హనుమంతరావు, కల్పలతారెడ్డి, వంశీ కృష్ణ, గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ పూనూరు గౌతమ్‌రెడ్డి, ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహన్‌రావు, ఎస్సీ మాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పి.అమ్మాజీ, పార్టీ అధికార ప్రతినిధి నారమల్లి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే జెన్కోలో ప్రమాదం

విశాలాంధ్ర బ్యూరో -నెల్లూరు: అధికార పార్టీ కాంట్రాక్టర్ విధులను సక్రమంగా నిర్వహించకపోక వల్లనే జెన్కోలో ప్రమాదం జరిగిందని నిపుణులు చెబుతున్నారు. నేలటూరు లోని శ్రీ దామోదరం సంజీవయ్య 2400 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులో ఈ నెల 27వ తేదీన బాయిలర్ నుండి వచ్చే బూడిదను శైలోకి పంపే నాలుగు హాఫర్లు ఒక్కసారిగా కూలి పోయాయి. ఈ సంఘటన జరిగిన సమయంలో అక్కడ కార్మికులు లేకపోవడంతో వారికి ప్రాణాపాయం తప్పింది. ఆ ప్రాంతంలో కార్మికులు ఉన్నట్లయితే ఆ బూడిద వారిపై పడి మరణించే వారే. అనుభవం లేని అధికార పార్టీకి చెందిన నాయకుడు ఆ బూడిదను తొలగించే కాంట్రాక్టును పొందారు. అయితే తగినంతమంది కార్మికులను ఏర్పాటు చేసుకుని పనులు సక్రమంగా నిర్వహించాల్సి ఉండగా, తరచూ ప్రాజెక్టు అధికారులను బెదిరిస్తూ, పనులు సక్రమంగా చేయకపోవడం వల్ల బూడిద పేరుకుపోయింది. అక్కడ విధులు నిర్వహించే సిబ్బంది... ప్రాజెక్టు అధికారులకు, రాష్ట్ర, కేంద్రంలోని అధికారులకు అనేకమార్లు సమస్య తీవ్రతను తెలియజేశారు. పనులు సరిగా చేయకపోతే మరొకరికి కాంట్రాక్టు పనులు బాధ్యతను అప్పగిస్తామని అధికారులు కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. సమస్య తీవ్రతను తెలుసుకున్న ఉన్నతాధికారులు ఇటీవల ఆ పనులను మరో కాంట్రాక్టర్‌కు అప్పగించారు.

సహకార బ్యాంకులపై

రిజర్వుబ్యాంక్ ఆంక్షలు దురదృష్టకరం

విశాలాంధ్రబ్యూరో-అనంతపురం: లాభాలలో ఉన్న సహకార బ్యాంకులపై రిజర్వుబ్యాంక్ ఆంక్షలు విధించడం సబబు కాదని ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. బ్యాంక్ అనంతపురం బ్రాంచి సభ్యుల మహాసభ... ఇక్కడి పోలీస్ కమ్యూనిటీహాల్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాఘవేంద్రరావు మాట్లాడుతూ... లాభాలలో ఉన్న సహకార బ్యాంకులపై రిజర్వుబ్యాంక్ ఆంక్షలు విధించడాన్ని నిరసించారు. సహకార బ్యాంకులు ప్రజలకోసం స్థాపించిన వని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం బ్యాంకు 63 కోట్ల లాభాలను ఆర్జించినట్లు తెలిపారు. అనంతపురం బ్రాంచి స్థాపించి 5సంవత్సారాలు పూర్తి చేసుకుని 6వ సంవత్సరంలోకి అడుగిడుంతుందని, 387 మంది ఈ బ్రాంచి లో సభ్యులుగా చేరారని పేర్కొన్నారు. 50 బ్రాంచిలలలో ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో బ్యాంక్ డైరెక్టర్లు జేవీ సత్యనారాయణ మూర్తి, పాల్యం నారాయణ స్వామి, గుత్తి కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ అహ్మద్ జిలానీ, వురవకొండ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రి స్వామి, జోనల్ మానేజర్, ఎం సత్యనారాయణ. బ్రాంచి మేనేజర్ జి.శేషగిరిరావు పాల్గొన్నారు.

విశాఖపోర్టు అభివృద్ధి పనులపై కేంద్రమంత్రి సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: కేంద్ర ఓడరేవులు, జలరవాణాశాఖ మంత్రి శర్బానంద్ సోనోవాల్, సోమవారం విశాఖ పోర్టులో వివిధ దశల్లో ఉన్న అభివృద్ధి పనులు, సరకు రవాణా వంటి అంశాలపై పోర్టు చైర్మన్, సీనియర్ అధికారులతో సమీక్షించారు. పోర్టులో జరుగుతున్న వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన పనుల తీరుపై మంత్రి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా క్రూయిజ్ టెర్మినల్ నిర్మాణం, కవర్డ్ స్టోరేజి యార్డులు, ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని ఆయన పోర్టు అధికారులను ఆదేశించారు. మంత్రి పోర్టు



బీవోటీ ఆపరేటర్లు, పీపీపీ ఆపరేటర్లు, పోర్టు యూజర్స్, స్టివెడోర్ అసోసియేషన్ల ప్రతనిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోర్టులో సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. పోర్టును మరింత అభివృద్ధి చేసేందుకు సలహాలు, సూచనలు స్వీకరించారు. పోర్టు ట్రేడ్ యూనియన్లు, అసోసియేషన్ ప్రతినిధులతోనూ మంత్రి సమావేశమయ్యారు. వారి డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సదరంర్భంగా పోర్టులో సుమారు 1446 కోట్ల రూపాయల వ్యయంతో చేపడుతున్న పలు ప్రాజెక్టుల స్థితి గతులను తెలుసుకున్నారు. రూ. 167 కోట్లతో చేపట్టిన ఓఆర్ 1, ఓఆర్ 2 ప్రాజెక్టుల విస్తరణ పనులు జరుగుతున్న తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. 2023 సెప్టెంబర్ నాటికి ఈ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఓఆర్ 3 బెర్త్ ఇప్పటికే విస్తరణ పూర్తి చేసుకుని మనుగడలోకి వచ్చిందన్నారు. ఈ సమావేశంలో పోర్టు చైర్మన్ రామ్మోహన్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కేంద్రంతో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కుమ్మక్కు

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ అధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు సోమవారానికి 473వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలలో ఎస్ఎంఎస్ 2 విభాగం కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి పోరాట కమిటీ ప్రతినిధులు డి.ఆదినారాయణ, ఎన్, రామారావు, వైటీ దాస్, గుమ్మడి నరేంద్ర, పీఎస్ఎన్ మూర్తి, వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ... స్టీల్ ప్లాంటును కొద్దిరోజుల వ్యవధిలోనే మూసి వేసే విధంగా యాజమాన్యం వ్యవహారశైలి ఉందని చెప్పారు. ప్రమాద ఘంటికలు మోగుతున్న ఈ పరిస్థితుల్లో కార్మికులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. యాజమాన్యం కేంద్ర ప్రభుత్వ మూసివేత విధానాలను అమలు చేస్తోంది. కేవలం రెండు నెలల్లో ఉత్పత్తి స్థాయిని పూర్తిగా దిగజార్చిందని విమర్శించారు. అమ్మకాలు లేకుండా స్టీల్‌ప్లాంట్‌ను ఆర్థిక ఇబ్బందుల్లో నెట్టి మూతబడే దిశగా యాజమాన్యం చర్యలను కార్మికులు గుర్తించారన్నారు. తక్షణం యాజమాన్యం అఖిలపక్ష కార్మిక సంఘాలను పిలిచి వాస్తవాలను వివరించాలని డిమాండ్ చేశారు. గతంలో నీటి, విద్యుత్ సంక్షోభాలు, హుద్ హుద్ తుపానులో ప్రమాదం తదితర క్లిష్టసమయాల్లో అప్పటి యాజమాన్యం, కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాడి విజయం సాధించాయని తెలిపారు. కానీ ప్రస్తుత యాజమాన్యం కేంద్రంతో కుమ్మక్కై ఏకపక్ష పోకడలకు దిగడం దుర్మార్గ చర్య అన్నారు. ఈ మధ్యకాలంలో యాజమాన్యం కోట్ల రూపాయలు దుర్వినియోగం చేస్తూ అనవసర ఖర్చులు పెడుతూ అవసరమైన ముడిసరుకు కొనడానికి తాత్సారం చేస్తోందని పేర్కొన్నారు. పర్యవసానంగా ఉత్పత్తిని గణనీయంగా తగ్గిపోయిందన్నారు. ఇలాంటి చర్యలు యాజమాన్యం మానుకోకపోతే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సుమారు రెండు లక్షల టన్నుల కోకింగ్ కోల్ వెస్సెల్స్ అందుబాటులో ఉండగా వాటికి కోట్ల రూపాయలు డెమరేజ్‌ను కడుతూ ఆర్థికంగా కంపెనీని నష్టాల్లో నెడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలో భాగంగానే యాజమాన్యం ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటోందని చెప్పారు. ఈ దీక్షా శిబిరంలో పీవీ రమణమూర్తి, కోరాడ వెంకట్రావు, సాయి జగదీష్ ఎం.ఎం.ప్రసాద్ శంకర్రావు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత సంక్షేమం.. దోపిడీ సీఎం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

వైసీపీ పాలనపై టీడీపీ చార్జ్‌షీట్ విడుదల

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మోసపూరిత సంక్షేమంతో ప్రజల్ని వంచిస్తున్నారని, వారిపై పన్నుల భారంమోపుతున్నారని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. సోమవారం ఆయన విశాఖ టీడీపీ కార్యాలయంలో వైసీపీ మూడేళ్ల పాలనపై టీడీపీ రూపొందించిన చార్జ్‌షీట్‌ను మీడియాముఖంగా విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ... దుర్మార్గుడైన ముఖ్యమంత్రి నేతృత్వంలో రాష్ట్రం... నేరాలు ఘోరాలు, విధ్వంసాలు, వినాశనాలకు నెలవుగా మారిందని, వాటన్నింటిని వివరిస్తూ టీడీపీ చార్జ్‌షీట్‌ను విడుదల చేసిందని చెప్పారు. 'మూడేళ్ల మోసకారీ పాలనలో 1111 విధ్వంసాలతో 30ఏళ్లు వెనక్కువెళ్లిన రాష్ట్రం' పేరుతో అనేక అంశాలను ప్రజలముందు ఉంచుతున్నామని అచ్చెన్నాయుడు తెలిపారు. మంచి కార్యక్రమంతో పాలన ప్రారంభించాల్సిన జగన్ రెడ్డి... ప్రజావేదిక కూల్చివేతతో తన విధ్వంసపాలనకు శ్రీకారంచుట్టారని ఆరోపించారు. మీటలు నొక్కుతున్నామంటూ మోసకారీ సంక్షేమంతో మూడేళ్ల పాటు ప్రజల్ని దారుణంగా దోచుకున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చినవెంటనే తనసొంతపత్రికలో పనిచేసేవారిని సలహాదారులు, పీఆర్వోలుగా నియమించిన జగన్... ప్రజలసొమ్ముని వారికి దోచిపెడుతున్నాడని విమర్శించారు. ప్రకటనల రూపంలో సాక్షి పత్రికకు వందలకోట్లు తగలేశారని చెప్పారు. రివర్స్ టెండరింగ్‌తో రాష్ట్రంలోని సాగునీటిప్రాజెక్ట్ లను, నీటిపారుదలవ్యవస్థను సర్వనాశనంచేశారని పేర్కొన్నారు. రాష్ట్రజనాభాలో ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీలు 70శాతం ఉంటే, ఒకరిద్దరికి మంత్రిపదవులు ఇవ్వడం వారికి సామాజికన్యాయం చేసినట్లు అవుతుందా అని ప్రశ్నించారు. ప్రభుత్వంలోని బీసీమంత్రులంతా నోరులేని మూగజీవుల్లా బతుకుతున్నారని, వారికి మంత్రిపదవులిచ్చిన జగన్ రెడ్డి... రాష్ట్రాన్ని విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, వై.వీ.సుబ్బారెడ్డి, వేమిరెడ్డిప్రభాకర్ రెడ్డిలకు రాసిచ్చార ని ఆరోపించారు.

ప్రతి విషయంలో పెత్తనం ఆ నలుగురు చేస్తుంటే, మంత్రులు బస్సుల్లో తిరుగుతూ... సామాజికన్యాయం అని మాట్లాడుతూ, బీసీలు, ఎస్సీ,ఎస్టీలు, మైనారిటీల పరువు తీస్తున్నారని విమర్శించారు. తన కేసుల్లో రెండోముద్దాయిగా ఉన్నవ్యక్తికి, 4వ, 5వ ముద్దాయిలుగా ఉన్నవారికి జగన్ రాజ్యసభసీట్లు ఇచ్చారని ఆరోపించారు. అదానీ డేటా సెంటర్ టీడీపీ హయాంలో రాష్ట్రానికివస్తే, దాన్నిరద్దుచేసిన జగన్ ఇప్పుడు కొత్తగా దావోస్ వెళ్లి... మరలా అదే ఒప్పందాన్ని కొత్తగా చేసుకున్నాడన్నారు. అదానీని కలవడానికి జగన్ దావోస్ వెళ్లాలా? ఢిల్లీవెళితే సరిపోదా? అని ప్రశ్నించారు. మీడియా సమావేశంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, అనకాపల్లి పార్లమెంటు అధ్యక్షుడు బుద్ధ నాగ జగదీశ్వరరావు, శాసనమండలి సభ్యుడు దువ్వారపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

దిక్కు లేక బొగ్గు దిగుమతి

ప్రపంచంలోకెల్లా అత్యధికంగా బొగ్గు తవ్వకాలు జరిపేది మన దేశమే. అదీ కోల్ ఇండియా అధీనంలో జరుగుతుంది. బొగ్గు ఉత్పత్తి, దిగుమతిలో కూడా మనం అగ్ర స్థానంలోనే ఉన్నాం. ప్రపంచంలో బొగ్గును ఎక్కువగా వినియోగించే దేశాలలో భారత్‌ది రెండో స్థానం. కానీ గత ఏప్రిల్‌లో బొగ్గు కొరత తీవ్రమైనందువల్ల అలాంటి పరిస్థితి మళ్లీ తలెత్తకూడదని కోల్ ఇండియా బొగ్గు దిగుమతి చేసుకోవాలని నిర్ణయించింది. 2015 తరవాత మనం బొగ్గు దిగుమతి చేసుకోవలసి రావడం ఇదే మొదటి సారి. గత ఏప్రిల్ నెలలో అనేక రాష్ట్రాలు విద్యుత్ సరఫరా చేయలేక కోతలు విధించవలసి వచ్చింది. ఆ పరిస్థితి మళ్లీ ఎదురుకాకూడదంటే దిగుమతి ఒక్కటే శరణ్యమైంది. మన విద్యుదుత్పత్తిలో 75 శాతం థర్మల్ విద్యుత్తే. బొగ్గు వినియోగించి విద్యుదుత్పత్తి చేయడంవల్ల కాలుష్య కారక ఉద్గారాలలో కూడా మనం ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉన్నాం. అవసరమైనప్పుడు దిగుమతులు తప్పకపోవచ్చు కానీ మనం ఉత్పత్తి చేసే బొగ్గుతో పోలిస్తే దిగుమతి చేసుకునే బొగ్గు ధర తడిసి మోపెడై అయిదు రెట్లు ఎక్కువ ఉంటుంది. అంటే విద్యుత్ ఛార్జీలు పెరగక తప్పదు. ఉదాహరణకు ఒక్క మధ్య ప్రదేశ్‌లోనే వెయ్యి కోట్ల రూపాయలు అదనంగా ఖర్చు చేయవలసి వస్తుంది. వివిధ రాష్ట్రాలు బొగ్గు దిగుమతి చేసుకోవడానికి ప్రయత్నాలు చేయకపోలేదు. కానీ అధిక ధరకు బొగ్గు దిగుమతి చేసుకోవడం ఖరీదైన వ్యవహారం కనక దిగుమతి చేసుకోవడానికి డబ్బు ఖర్చు పెట్టడానికి వెనుకాడుతున్నాయి. అందుకే కేంద్రమే దిగుమతి చేసుకుంటే మేలని అనేక రాష్ట్రాలు సూచించాయి. బొగ్గు దిగుమతి చేసుకుని విద్యుదుత్పత్తి చేస్తే ఒక్కో యూనిట్ ధర కనీసం రూపాయి పెరగక తప్పదు. బొగ్గు కొరత వల్ల విద్యుదుత్పత్తికి విఘాతం కలగడంతో గత ఏడాది అక్టోబర్‌లో విద్యుత్ కొరత గత అయిదేళ్లలో ఎన్నడూ లేనంతగా పెరిగింది. విద్యుదుత్పత్తి చేసే కంపెనీలు తగినంత బొగ్గు నిలవలు ఉంచుకోకపోవడంవల్ల కొరత ప్రభావం బాగా కనిపించింది. నైరుతి రుతుపవనాలు మొదలైతే వర్షాలు కురిసే సమయంలో బొగ్గు ఉత్పత్తి సహజంగానే మందగిస్తుంది. వర్షాలవల్ల బొగ్గు గనుల్లోకి నీరు చేరుతుంది. థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రాలకు బొగ్గు రవాణా చేయడం కూడా ఇబ్బంది అవుతుంది. ప్రస్తుత పరిస్థితినిబట్టి చూస్తే బొగ్గు కొరత ప్రతి ఏటా తప్పేట్టు లేదని అనిపిస్తోంది. ఇంధనం, పరిశుభ్ర ఇంధన పరిశోధనా కేంద్రం (సి.ఆర్.ఇ.ఎ.) అంచనా ప్రకారం జులై నుంచి సెప్టెంబర్ దాకా బొగ్గు కొరత తీవ్రంగా ఉండక తప్పదనిపిస్తోంది. ఎందుకంటే విద్యుత్తుకు గిరాకీ పెరుగుతుంది.

బొగ్గు సరఫరాలో అసమర్థత, అధికారుల అలసత్వంవల్ల కూడా బొగ్గు కొరత దుర్భర స్థాయికి పెరుగుతోంది. విద్యుత్ కొరత కారణంగా దిల్లీలోని డా. బాబా సాహెబ్ అంబేద్కర్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని వెళ్లిపోయే రోగులు ఇబ్బంది పడ్డారు. మామూలుగా జరిగే శస్త్ర చికిత్సలూ ఆగిపోయాయి. తీవ్రమైన వ్యాధులు ఉన్న వారిని ఆసుపత్రిలో చేర్చుకోవడానికీ విఘాతం కలిగింది. అంటే ఆసుపత్రులకూ విద్యుత్ కోత తప్పలేదు. నిజానికి ఈ సంవత్సరం మన దేశంలో బొగ్గు ఉత్పత్తి రికార్డు స్థాయిలో జరిగింది. ఇంతకు ముందెన్నడూ అంత ఉత్పత్తి జరగలేదు. ఒక వేపు వడగాలులు చండ ప్రచండంగా వీస్తుంటే విద్యుత్ కొరత అదనపు సమస్యలు తెచ్చి పెట్టింది. ఈ సారి నైరుతి రుతుపవనాలు కనీసం మూడు రోజుల ముందే వస్తాయంటున్నారు గనక బొగ్గు రవాణాకు అంతరాయం కలగవచ్చు. మరో వేపు వచ్చే నాలుగేళ్లలో 81 థర్మల్ కేంద్రాలలో విద్యుదుత్పత్తి తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. థర్మల్ విద్యుత్తు కన్నా చౌకగా, కాలుష్యాన్ని నియంత్రించే ప్రత్యామ్నాయ ఇంధనాల మీద ఆధారపడడం కోసం కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ విద్యుత్ కొరత అనివార్యమవుతుంది. థర్మల్ విద్యుత్ కేంద్రాలు అత్యంత తక్కువగా పని చేసేట్టు చూడాలని కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ మే 26న రాసిన లేఖలో పేర్కొంది. థర్మల్ విద్యుత్ కేంద్రాల దగ్గర 66.49 మిలియన్ టన్నుల బొగ్గు నిలవలు ఉండవలసి ఉండగా కేవలం 21.16 మిలియన్ టన్నుల బొగ్గు నిలవలే ఉన్నాయి. అంటే నిలవలు 33 శాతం తగ్గినట్టే. స్వదేశంలో ఉత్పత్తి అయ్యే బొగ్గు మీద 82 థర్మల్ విద్యుత్ కేంద్రాలు ఆధారపడతాయి. పది విద్యుత్ కేంద్రాలు దిగుమతి చేసుకునే బొగ్గుతో నడుస్తాయి. బొగ్గు కొరతవల్ల విద్యుదుత్పత్తికి విఘాతం కలిగే మాట నిజమే కాని కర్బన ఉద్గారాలను తగ్గించాలన్న సంకల్పాన్ని సైతం దృష్టిలో ఉంచుకోవలసి ఉంది. ప్రతి ఏటా విద్యుత్తు అవసరాలు పెరుగుతూనే ఉన్నాయి. ఈ దశలో బొగ్గు కొరత వల్ల థర్మల్ విద్యుదుత్పాదనకు విఘాతం కలగడం అదనపు సమస్యలు తెచ్చిపెడ్తోంది. గత 38 సంవత్సరాలలో విద్యుత్తు అవసరాలు ప్రస్తుతం పెరిగినట్టు ఎప్పుడూ పెరగలేదు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంవల్ల ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే బొగ్గు ధర విపరీతంగా పెరిగిపోయింది. అసలు సరఫరాలకే అంతరాయం ఏర్పడుతోంది. సెప్టెంబర్‌తో అంతమయ్యే త్రైమాసికంలో 197.3 మిలియన్ టన్నుల బొగ్గు నిలవలు అవసరమైతే అవి కేవలం 154.7 మిలియన్ టన్నులకే పరిమితం అవుతాయని అంచనా. అంటే 42.5 మిలియన్ టన్నుల కొరత తప్పదు. ఇంతకు ముందు 37 మిలియన్ టన్నుల కొరతే ఉంటుందనుకున్నారు. కాని అది పెరుగుతోంది. కాలుష్యం తగ్గించాలంటే థర్మల్ విద్యుత్తు మీద ఆధారపడడం తగ్గించవలసిందే. అనుమానం లేదు. కానీ కాలుష్య రహిత విద్యుదుత్పాదనకు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలేమిటి అన్న ప్రశ్నకు సరైన సమాధానం లేదు. ఇంతకు ముందు అణు విద్యుత్తు మేలనుకున్నాం. అది చౌక కూడా కావచ్చు. సుదీర్ఘ కాలం దాని మీద ఆధారపడే అవకాశం ఉన్న మాటా నిజమే. కానీ అణు విద్యుత్ కేంద్రాలలో ప్రమాదాలు జరిగితే అవి ఎంత తీవ్రంగా ఉంటాయో చూస్తూనే ఉన్నాం. పశ్చిమ దేశాలు క్రమంగా అణువిద్యుదుత్పాదనకు స్వస్తి చెప్తున్నాయి. తాము ఇంతకు ముందు నడిపి ఇప్పుడు పనికి రాకుండా ఉన్న అణు విద్యుత్ కేంద్రాల సామాగ్రిని, ఉపకరణాలను భారత్ లాంటి దేశాలకు సరఫరా చేసి తాము సురక్షితంగా ఉంటూ మన నెత్తిన మరింత ప్రమాదం మోపాలని చూస్తున్నాయి. భారీ ఆనకట్టల నిర్మాణమూ తగ్గినందువల్ల జల విద్యుదుత్పాదనా మందగించింది. పైగా జల విద్యుదుత్పాదన మీద ఏడాది పొడవునా ఆధారపడగలమన్న విశ్వాసం లేదు. సౌర విద్యుత్తు గురించి ఉపన్యాసాలైతే వింటున్నాం కానీ దానికి కావలసిన పరికరాల ధరలు ఇప్పటికీ సామాన్యులకు అందుబాటులో లేవు. కొత్తగా నిర్మిస్తున్న భవనాలకైనా సౌర విద్యుత్తు వినియోగం తప్పనిసరి చేస్తే కొంత ప్రయోజనం ఉండొచ్చు. సౌర విద్యుత్తుకు అవకాశాలు ఏర్పాటు చేసుకుంటే అన్ని రకాలుగా ప్రయోజనం ఉంటుంది.

జగన్ పాలనలో రైతులకు ఒరిగిందేమీలేదు


రావుల వెంకయ్య

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ సంస్కరణల బిల్లును అందరికన్నా ముందుగా మన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడానికి జీ.ఓ.జారీ చేసింది. మన పక్కన ఉన్న తెలంగాణ, తమిళనాడుతో కలిపి బిజెపి పాలిత రాష్ట్రాలతో సహా 11 రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. మన రాష్ట్రంలోని మెట్ట ప్రాంతాల్లో 18 లక్షలకు పైగా రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ విద్యుత్ కనెక్షన్లకు గత ప్రభుత్వాలు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాయి. ఇప్పుడు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం నాలుగు వేల కోట్ల రుణం కోసం కేంద్ర ప్రభుత్వం వద్ద 6 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి రైతు మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తామన్నారు. ముందు రైతులు విద్యుత్ బిల్లులు చెల్లిస్తే వారి ఖాతాలో ప్రభుత్వం డబ్బు జమ చేస్తుందని చెబుతున్నారు. అది నమ్మశక్యమా?

జగన్మోహన్‌రెడ్డి పాలనకు ఈ మే నాటికి మూడేళ్ళు నిండాయి. ఈ మూడు సంవత్సరాల కాలంలో ఆంధ్రప్రదేశ్ రైతాంగానికి మాత్రం ఒరిగిందేమీ లేదు. రైతుల సంక్షేమం కోసం పలు పథకాలు ప్రవేశపెడుతున్నట్లు చాలా ఆర్భాటంగా ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నది. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా సంవత్సరంపాటు రైతులు ఆందోళన చేస్తుంటే వారికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వకపోగా నరేంద్ర మోదీ ప్రభుత్వానికి బాసటగా నిలబడి లోక్‌సభ, రాజ్యసభలలో బాహాటంగా బలపర్చి మద్దతు తెలియజేసింది. ఇదీ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులకిచ్చిన సహాయసహకారం. దీనినిబట్టి రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఎడల ఎలాంటి వైఖరి తీసుకుంటున్నదో తేటతెల్లమౌతున్నది. అలాగే ఈ మూడు సంవత్సరాల కాలంలో రైతు వ్యతిరేక కార్యకలాపాలు అమలుజరపటంలో ముందంజలో ఉన్నది.

రైతు భరోసా కేంద్రాల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఆఫీసులు ఏర్పాటు చేసారు కానీ వీటివల్ల రైతులకు మేలు జరగకపోగా ఆచరణలో నష్టం ఎదురైనది. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు గతంలో సహకార సంఘాల ద్వారా విక్రయాలు జరిగేవి. ఇప్పుడు అవి రైతు భరోసా కేంద్రాలకు మార్చారు. దానివల్ల రైతుకు అవసరంలేని కాంప్లెక్స్ ఎరువులు తీసుకొంటేనే యూరియా, సల్ఫేట్ లాంటి అతి ముఖ్యమైన ఎరువులను సరఫరా చేస్తామని లింకు పెడుతున్నారు. దానివల్ల రైతులకు అదనపు భారం పడుతున్నది. రైతు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు కొనుగోలులో పెద్ద ఎత్తున కుంభకోణం జరుగుతున్నదని ఈ మార్కెట్ విధానం పేరుతో రైతులు కానివారి పేర్లతో రైతుల ఉత్పత్తులు కొనుగోలు చేసి మధ్య దళారులుగా ఉన్న వ్యాపారస్థులు అధిక ధరలకు అమ్ముకుంటున్నారని, దీని వెనక పెద్ద కుంభకోణం చోటుచేసుకున్నదని సాక్షాత్తు అధికార పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ ప్రకటించడంతో తేటతెల్లమౌతున్నది. అలాగే రైతుల వద్ద కొన్న ధాన్యానికి రెండు వారాల్లో డబ్బులు చెల్లించాల్సి ఉంటే నెలల తరబడి రైతులను ఆఫీసుల చుట్టూ తిప్పుకుంటున్నారు. గతంలో కొన్న ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు వేల కోట్ల రూపాయలకు పైగా బకాయిలు చెల్లించాల్సి ఉన్నది.

రైతు భరోసా పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకు 12,500 రూపాయలు చెల్లిస్తామని ఎన్నికల ముందు వై.సి.పి. వాగ్దానం చేసింది. అధికారంలోకి వచ్చిన తరవాత ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి క్రింద ఇచ్చే 6000 రూపాయలు కలుపుకొని రాష్ట్ర ప్రభుత్వం 13,500 రూపాయలు ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ వాగ్దానం ప్రకారం 12,500+6,000 కలుపుకొని 18,500 రూపాయలు చెల్లించాల్సి ఉంటే కేవలం 13,500కే పరిమితం చేయడం రాష్ట్ర ప్రభుత్వ వాటాను 7,500 రూపాయలకు కుదించిందన్నమాట. అది కూడా ఎంతమందికి ఇస్తున్నారు? అని పరిశీలిస్తే రాష్ట్రంలో 86 లక్షల రైతు కుటుంబాలు ఉంటే వీరు చెల్లిస్తున్నది 50 లక్షల మందికి మాత్రమే. అంటే 36 లక్షల మందికి మొండి చెయ్యి చూపిస్తున్నారు. అందులో కౌలు రైతులు 16 లక్షల మందికిగాను 50 వేల మందికి మాత్రమే చెల్లించి చేతులు దులుపుకుంటున్నారు. మైక్రో ఇరిగేషన్ పేరుతో రైతులకిచ్చే రాయితీలకు గత రెండు సంవత్సరాల నుండి మంగళం పాడారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం పెద్ద ఎత్తున చేసిన ఆందోళన ఫలితంగా కొంత మేరకు ఇటీవల కాలంలో ఆ సౌకర్యాన్ని పునరుద్ధరించారు. అది కరువు ప్రాంత రైతులకు ఊరటగా భావించాల్సి ఉన్నది. ధరల స్థిరీకరణ నిధి తొలి సంవత్సరం బడ్జెట్‌లో మూడు వేల కోట్లు కేటాయించి తరవాత 2 వేలకు, 1,500కు తగ్గించారు. ఇప్పుడు ఏకంగా 500 కోట్లకు మాత్రమే పరిమితం చేశారు. దాని అర్థమేమిటో తేటతెల్లమౌతున్నది.

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ సంస్కరణల బిల్లును అందరికన్నా ముందుగా మన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడానికి జీ.ఓ.జారీ చేసింది. మన పక్కన ఉన్న తెలంగాణ, తమిళనాడుతో కలిపి బిజెపి పాలిత రాష్ట్రాలతో సహా 11 రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. మన రాష్ట్రంలోని మెట్ట ప్రాంతాల్లో 18 లక్షలకు పైగా రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ విద్యుత్ కనెక్షన్లకు గత ప్రభుత్వాలు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాయి. ఇప్పుడు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం నాలుగు వేల కోట్ల రుణం కోసం కేంద్ర ప్రభుత్వం వద్ద 6 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి రైతు మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తామన్నారు. ముందు రైతులు విద్యుత్ బిల్లులు చెల్లిస్తే వారి ఖాతాలో ప్రభుత్వం డబ్బు జమ చేస్తుందని చెబుతున్నారు. అది నమ్మశక్యమా? ఇప్పటికే రైతులు తీసుకున్న బ్యాంకు రుణాలకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన సున్నా వడ్డీ రాయితీ సంవత్సరం గడుస్తున్నా 66 లక్షల మందికి రాష్ట్ర ప్రభుత్వ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక రైతుల విద్యుత్ బిల్లులు తరవాత చెల్లిస్తామంటే నమ్మేది ఎలా? అంటే ఈ పేరుతో రైతులకు ఇస్తున్న ఉచిత విద్యుత్‌కు మంగళం పాడే తలంపు మాత్రమే. ఇక ప్రాజెక్టుల పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నది. పోలవరం ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందో అంతుపట్టడం లేదు. వెలిగొండ ప్రాజెక్టు లాంటి ముఖ్యమైన ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన కరెంటు బిల్లులు చెల్లించలేదనే కారణంతో పనులు ఆగిపోయాయి. ఇంకా ఇలాంటి ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం, ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. దానికి రైతులంతా ఐక్యంగా ముందుకు రావాలి.

వ్యాస రచయిత ఎఐకెఎస్ అధ్యక్షులు

ఇక్కడ ప్రశ్నలుండవు చెప్పింది వినడమే!

సుశీల్ కుట్టి

నరేంద్ర మోదీ ఎనిమిదేళ్ల పాలనా కాలంలో ప్రశ్నలే లేవు. అంతా చెప్పింది వినటమే. ప్రజలు అనేక సమస్యలతో ఉక్కపోత జీవనం సాగిస్తు న్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు గడచినా, ఇంకా అభివృద్ధి చెందుతోన్న దేశంగానే ఉన్నది. 2014 మే 26న అధికారం చేపట్టిన ఆర్ఎస్ ఎస్-బిజెపి నేత నరేంద్రమోదీ నెలకోసారి మన్‌కీ బాత్‌ను నిర్వహిస్తున్నారు. తన పాలనలో ఎంతో సాధించామని చెప్పుకోవడం మినహా దేశంలో నిరుద్యోగం, పేదరికం, ఆరోగ్య సేవలు అందని స్థితి రోజురోజుకి క్షీణిస్తున్న విద్యా ప్రమాణాలు తదితర అనేక ప్రజా సమస్యలను ఆయన పట్టించుకోరు. బడా పారిశ్రామిక, వాణిజ్యవేత్తలు, కార్పొరేట్లు ఆయనకు స్నేహితులు. వారి సంక్షేమానికే ప్రాధాన్యత. ఆయన ఎనిమిదేళ్ల పాలన గురించి చర్చిస్తున్నవారు ఇక్కడ పేర్కొన్న సమస్యలను ప్రధానికి విన్నవించినా ఏ ప్రయోజనం కనిపించడంలేదు. సంబరాలు చేసుకోవడంలో మాత్రం బిజెపి నేతలు తలమున కలవుతున్నారు. సుస్థిరమైన, బలమైన మోదీ పాలనలో కంటే గతంలో ఏనాడూ భారతదేశం గొప్పగా లేదని చెబుతూ చంకలు గుద్దుకుంటున్నారు. మోదీ బలమైన, స్థిరమైన లక్షణాలు గల పాలనలో కోట్లాది మంది ప్రజలు సమస్యల వలయంలో చిక్కుకొని ఉన్నారు. విశ్లేషకులు చెప్పే అంశాలు వాస్త వాలతో కూడినవి కాదని ఈ పాలకులు మాట్లాడుతున్నారు. మోదీ పాలనలో వాస్తవాలు ప్రకటిస్తేనే ప్రజలలో ఒక అభిప్రాయం కలుగుతుంది. అసలు వాస్తవాలే చెప్పనప్పుడు ఎవరెన్ని చెప్పినా అబద్ధాలనే పాలకులు ప్రచారం సాగిస్తున్నారు.

ప్రపంచంలోను, భారతదేశంలోను మితవాద శక్తులు దాదాపు దశాబ్ది కాలంగా కేవలం అర్ధ సత్యాలను లేదా అసత్యాలను ప్రచారం చేస్తూ పరిపాలన సాగిస్తున్నాయి. అమెరికా, భారతదేశంతో సహా అనేక దేశాలలో మితవాద శక్తులు పరిపాలన సాగిస్తున్నాయి. ఈ శక్తుల పాలనలో అన్ని విషయాలలోను తల్లకిందులుగానే మాట్లాడుతున్నారు. ఇటీవల కాలంలో అమెరికాలో వామపక్ష భావాలు గల ప్రజలు పెరుగుతున్నారు. భారతదేశంలో మాత్రం మిత, మతవాద శక్తులు బలోపేతమవుతున్నాయి. ఎనిమిదేళ్ల మోదీ పాలనలో చిత్తశుద్ధి కలిగిన రాజకీయ లేదా ఆర్థిక విశ్లేషకుల నుండి సత్యాలతో కూడిన సమాచారం బయటకు రానీయడం లేదు. పైగా మోదీ ప్రభుత్వానికి అనుకూలమైన, అసత్యాలతో కూడిన ప్రచారాన్ని సాగించటానికి అనేక ప్రసార, ప్రచార మాధ్యమాలు ఉన్నాయి. ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన వాస్తవ గణాంకాలను తేల్చుకునే అవకాశమే లేకుండా పోయింది. సామాన్యుడు ప్రజాస్వామిక వ్యవస్థలో నాలుగో స్తంభంగా పేర్కొంటున్న మీడియా అందించే విషయాలను వినడమేగాని వాస్తవాలను తెలుసుకునే అవకాశమే లేదు.

వార్తా ఛానల్స్, వార్తా ప్రచురణ రంగంలో బిజెపి అధికార ప్రతినిధులు పైచేయిగా నిలిచి తప్పుడు సమాచారాన్ని, అబద్ధాలను జనానికి అందిస్తున్నారు. ఉదాహరణకి సృష్టిస్తున్న ఉద్యోగాలు, నిరుద్యోగ సమస్య, పేదరికం స్థాయి, పెరుగుతున్న ద్రవ్యోల్బణం తదితర అనేక అంశాలలో ఈ ప్రభుత్వం విఫలమైనప్పటికీ ఐఎంఎఫ్ నుండి ఆర్‌బిఐ దాకా అర్ధ సత్యాలనే అందిస్తున్నాయి. మోదీ విదేశీ పర్యటనలలో కూడా సమాచార సేకరణకు జర్నలిస్టులు ఎదురు చూడటమే కాని ఆయన వారికి అందనంత దూరంలోనే ఉంటున్నారు. ఇక ప్రశ్నించి సమాధానాలు తెలుసుకునే అవకాశం ఎక్కడ ఉంటుంది? జర్నలిస్టులతో మాట్లాడేందుకు మోదీ అసలు ఆసక్తి చూపరు. అలాంటప్పుడు ప్రతిరోజూ జరిగే అక్రమాలు, అన్యాయాలపై ప్రశ్నించి తెలుసుకునే అవకాశం ఎవరికీ ఉండదు. జర్నలిస్టులకు ఆయన ఎందుకు దూరంగా ఉంటున్నారో? గుజరాత్‌లో మోదీ రాజ్యమేలినంత కాలం ఇదే పరిస్థితి. పైగా అర్ధ సత్యాలతో, అసత్యాలతో కూడిన సమాచారాన్ని విస్తృతంగా ప్రచారంలో పెట్టి కేంద్రంలో అధికారానికి రాగలిగారని అనేక విశ్లేషణలు వెలువడ్డాయి. జర్నలిస్టులను కలుపుకునేందుకు మోదీ ఎందుకు భయపడుతున్నారని అనేకమంది ప్రశ్నిస్తున్నారు. ప్రశ్నించే వారంటే ఆయనకు చికాకు. ఈ ఎనిమిదేళ్లలో ఆయన చెప్పిందే ప్రజలు విన్నారు.

బహుశా మన్‌కీ బాత్‌తో ఆయన అలిసిపోయారేమో! ఈ బాత్‌లో ప్రశ్నలు, జవాబులు ఉండవు. చెప్పింది వినడమే ప్రజల వంతు. మోదీ మాత్రం తన పాలనా తీరును ఇసుమంత కూడా మార్చుకున్న సూచనలు లేవు. కనీసం టెలివిజన్ మీడియా అయినా మన్‌కీ బాత్ ముగిసిన తరవాత కొన్ని అంశాలపై ప్రశ్నించి తెలుసుకునేందుకు అవకాశం ఉండదు. బహుశా నియంతృత్వ పాలనలో మాత్రమే ఇలాంటి స్థితి ఉండవచ్చు. అతి పెద్ద ప్రజా స్వామ్య దేశంగా చెప్పుకొనే చోట చెప్పింది మాత్రమే విని ప్రజలు తలలూపా లని కోరుకొంటున్న పరిస్థితి నెలకొని ఉంది. ప్రధాని కోరుకుంటేనే ఆయన వద్దకు ఎవరైనా వెళ్లి మాట్లాడతారు. తనకు అనుకూలంగా ఉన్న మీడియా ప్రతినిధితో మాట్లాడిన సందర్భాలు కూడా చాలా తక్కువ. ఉదాహరణకు అత్యంత ముఖ్యమైన ఉమ్మడి పౌరస్మృతి అంశాన్ని మోదీ ఏం చేయబోతు న్నారు? అని తెలుసుకొనే అవకాశమూ ఉండదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అతి ముఖ్యమైన అంశం ప్రభుత్వాలు తీసుకొనే చర్యలన్నీ ప్రజలకు తప్పని సరిగా తెలియజేయాలి. అయితే ఇందులో అమలు చేసే అంశాలలో వాస్త వాలతో కూడిన సమాచారం అందించడమనేది మోదీ పాలనలో లేకుండా పోయింది.

ఇ-మెయిల్

పుగాకుతో ఆరోగ్యం అంపశయ్యకు

టెక్నాలజీ పరంగా భారతదేశం ఎంత అభివృద్ధి చెందుతోందో కాలుష్య రంగాలు కూడా అంతే వేగంతో ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా పుగాకు ఉత్పత్తుల వాడకం వల్ల సంభవిస్తున్న మరణాల సంఖ్య ప్రమాద స్థాయికి చేరుకుంది. ఒకప్పుడు సాంప్రదాయ బద్ధంగా మెలిగిన సమాజంలో ఎక్కడో తప్ప యువత వీటి జోలికి వెళ్ళేది కాదు. కానీ నేడు టీనేజీ నుండే గుట్కాలు, సిగరెట్లు, బీడిలు, గంజాయి లాంటి దుర్వ్యసనాలకు బానిసలవుతున్నారు. పుగాకు ఉత్పత్తులైన సిగరెట్లలో వేల సంఖ్యలో హానికరమైన రసాయనాలు ఉంటాయి. ముఖ్యంగా కాన్సర్ కారకమైన రసాయనాలు ఎక్కువగా ఉంటాయి. చుట్టలు, బీడీలు, సిగరెట్లు వినియోగంతో క్యాన్సర్, గుండె జబ్బులే కాకుండా అసాంక్రమిక వ్యాధులకూ గురి అవుతారు. ఒకప్పుడు దేశవ్యాప్తంగా 30 శాతంలో ఉన్న ఈ వాడకం నేటి తరంలో 50 శాతానికి విస్తరించింది. టీనేజీ యువత పెరుగుదలకు తోడ్పడే జన్యువులను ఈ ధూమపానం నాశనం చేస్తుంది. యువతను నిర్వీర్యం చేస్తుంది. కొంతమంది యువతులకూ ఈ ధూమపానం అలవాటు ఉంది. వీటివల్ల గుండె, గొంతుక, మూత్ర పిండాలు, లివర్, పొత్తికడుపు, గర్భాశయం, మలద్వారం, బ్లడ్ మొత్తంగా క్యాన్సర్‌కు గురై మరణానికి చేరువవుతున్నారు. స్త్రీలకు పీరియడ్స్ సరిగా రాకపోవడం, గర్భవతులకు రక్త స్రావమై పిండం ఎదుగుదల లేక అబార్షన్లకు దారి తీయడం జరుగవచ్చు. సిగరెట్లలో, బీడి ఆకుల్లో అందంగా కూర్చబడుతున్న వేస్టు పుగాకు పొడివల్ల జీర్ణ వ్యవస్థలు సమూలంగా నాశనమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలో పని చేసుకునేవారు చాలామంది చుట్ట కాల్చడమే కాకుండా అదే చుట్టను నిప్పు వైపు తిప్పి నోట్లో పెట్టుకుని ఆనందిస్తారు. తమలపాకుతో పుగాకు ఉండచుట్టి గంటల తరబడి నోట్లో ఉంచి రోడ్డుమీద ఉమ్ముతుంటారు. రోడ్డుమీద ఉమ్ములు, టీస్టాల్స్ వద్ద, స్కూల్స్, దేవాలయాల వద్ద, పిల్లలు, పెద్దవాళ్ళ వద్ద ధూమపానం చేయడంతో వారితోపాటు అలవాటులేని వారు కూడా ఇన్ఫెక్షన్ల బారిన పడతారు. అందమైన ఆకర్షణీయమైన డిజైన్లతో సిగరెట్ ప్యాకెట్లపైన క్యాన్సర్ హెచ్చరికలు చేస్తూనే పుగాకు ఉత్పత్తుల విభాగాలలో పనిచేస్తున్న అనేక మంది కార్మికులు జీవనోపాధి కోల్పోతారనే కారణాలు చెబుతున్న ప్రభుత్వాలు వాటి ఆదాయం కోసం కూడా పుగాకు ఉత్పత్తుల నియంత్రణపై దృష్టి పెట్టడం లేదు. ప్రకటనలకే ప్రజల్లో మార్పువస్తే రకరకాల వైరస్‌లు సమాజంలో ఇంతగా ఉద్భవించి మరణాలు సంభవించేవి కావు. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ఈ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి, ఉత్పత్తిదారులకు మరో మార్గం చూపించి వీటిపై పూర్తి నిషేధం దిశగా అడుగులు వేయవచ్చు. ఇంత కరోనా వైరస్ భయంలో కూడా రోడ్లపైన విచ్చల విడిగా చేస్తున్న ధూమపానం వల్ల అది పీల్చుకుంటున్న అనేకమంది అమాయకులు రోగాలకు గురవుతున్నారు. వీటి నిషేధానికి ప్రభుత్వాలు ఎప్పటికీ పూనుకోవనే ధైర్యంతో ప్రతి సంవత్సరం కొత్త కొత్త ఉత్పత్తులను ఆకర్షణీయంగా తయారు చేస్తూ వ్యసనపరులను ప్రసార మాధ్యమాల ద్వారా ఆకట్టుకుంటూ, వినియోగదారులను చేజారిపోకుండా చూసుకుంటూ ధనార్జనలో పోటీపడుతున్నారు. ఈ కారణంగా నియంత్రణ లేని ఈ వ్యవస్థలను నమ్ముకోకుండా ఎవరికి వారే స్వీయ నియంత్రణ పాటించాలి.

జోస్యుల వేణుగోపాల్, 9440436806

చేసింది చాలక కమల నాథుల పగటి కలలు!

వి. శంకరయ్య

దక్షిణ భారతదేశంలో కర్నాటక తప్ప (రేపు ఎన్నికల్లో ఏమౌతుందో) మిగిలిన రాష్ట్రాల ముఖ్యమంత్రులు జగన్మోహన్ రెడ్డి మినహా అందరూ కేంద్రానికి వ్యతిరేకంగా వున్నారు. పార్టీ వేరే గాని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి అన్ని విధాలా అండదండలు ఇస్తున్న నేపథ్యంలో ఏది ఏమైనా తాము అధికారంలోకి రాలేము కాబట్టి జగన్మోహన్ రెడ్డిని ఓడించేందుకు కేంద్ర బిజెపి నాయకత్వం సిద్ధంగా లేదు. సోమ వీర్రాజుకు ఈ అంశం తెలుసు. రాష్ట్రంలో ద్విముఖ లేక బహుముఖ పోటీ జరి గితే తిరిగి జగన్ సులభంగా అధికారం చేపట్టే అవ కాశాలు వున్నందున అందుకు అనువుగా కమల నాథులు పావులు కదుపుతూ పగటి కలలు కన్నట్లు నటిస్తున్నారు.

రాష్ట్ర బిజెపి అధ్యక్షులు సోము వీర్రాజుతో పాటు తరచూ దిల్లీ నుండి వచ్చే కేంద్ర మంత్రులు, నేతలు పచ్చి అబద్ధాలు వల్లె వేస్తూ ఆకాశానికి నిచ్చెనలేస్తున్నారు. నవ్వి పోతారని కూడా వెరవకుండా 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో తాము అధికారంలోకొస్తామని పగటి కలలు కంటున్నారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాల్లో 50 శాతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానివేనని జాతీయ రహదారుల నిర్మాణం తమ చలవేనని చెబుతున్నారు. రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం బిజెపి నేతలను ఏ మాత్రం నిలదీయలేనందున సోము వీర్రాజు లాంటి వారు రోజుకొక ప్రకటన చేసి అధికారం తమదేనని గొప్పలకు పోతున్నారు. ప్రతి చిన్న విషయానికి ఇతర ప్రతిపక్షాలపై అంతెత్తున లేచే వైకాపా మంత్రులు, నేతలు బిజెపి నేతలు చేస్తున్న ప్రకటనలు ఆరోపణలపై కన్నంలో తేలు కుట్టిన దొంగల్లా నోరు విప్ప లేకున్నారు. సంక్షేమ పథకాలు, జాతీయ రహదారుల నిర్మాణం ఒక్క ఆంధ్ర ప్రదేశ్‌కే కాదు, దేశంలోని అన్ని రాష్ట్రాలకు, ఇప్పుడే కాదు స్వాతంత్ర్య వచ్చిన నాటి నుండి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నవేనని వైకాపా నేతలు ప్రశ్నించ లేకున్నారు. ఇలాంటి కీలకమైన అంశాలను నిలదీస్తే తమ నేతపై కేంద్ర ప్రభుత్వం పంజా వేస్తుందనే భయంతో నోరు విప్పడం లేదు. తుదకు రేషన్ షాపుల్లో ప్రధాని మోదీ ఫోటో పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

దేశంలోని ఇతర రాష్ట్రాలకన్నా భిన్నంగా ఎక్కువగా ఎపిలో ఏవైనా పథకాలు అమలు జరుగుతూ వుంటే ప్రత్యేకంగా చెప్పుకొనే అవకాశం వుంటుంది. అలాంటిది లేకపోగా ఎపికి చట్ట బద్ధత గల పథకాలు ప్రాజెక్టులకు కూడా కేంద్ర ప్రభుత్వం ఎగనామం పెడుతోంది. తనకు 25 మంది పార్లమెంటు సభ్యులను గెలిపించి ఇస్తే ప్రత్యేక హోదా తీసుకు వస్తానని చెప్పి అధికారం చేపట్టిన జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక హోదా అటుంచి కేంద్ర ప్రభుత్వాన్ని చట్ట బద్ధత గల రాయితీలు పథకాలు ప్రాజెక్టుల గురించి నిలదీయడం లేదు. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అని పోరాడి త్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటు పరం చేయనున్నప్పటికీ ముఖ్యమంత్రి గట్టిగా అడగలేకున్నారు. మరి త్వరలో ఎపి పర్యటనకు వచ్చే ప్రధాన మంత్రితో పాటు బిజెపి జాతీయ అధ్యక్షుడు నడ్డా ఇంకెన్ని కల్ల బొల్లి కబుర్లు చెబుతారో చూడాలి.

రాష్ట్ర విభజన చట్టం మేరకు చట్టబద్ధంగా కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్‌లో అమలు చేయవలసిన పథకాలు ప్రాజెక్టులు అన్నింటికీ గ్రహణం పట్టించింది. రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 46(3) మేరకు వెనుకబడిన ప్రాంతాలకు ప్రకటించిన పత్యేక ప్యాకేజీ ముష్టిగా మూడేళ్లు ఇచ్చి ఎగ్గొట్టింది. కడప ఉక్కు కర్మాగారం గాలికి పోయింది. పైగా రాయలసీమకు జీవనాడులుగా వున్న మిగులు జలాల ఆధారంగా గల ప్రాజెక్టుల భవిష్యత్తు ప్రమాదంలోకి నెట్టింది. కృష్ణా బోర్డు నోటిఫై చేసే సమయంలో రాష్ట్ర విభజన చట్టం 11 షెడ్యూల్‌లో పొందుపర్చిన గాలేరు నగరి హంద్రీనీవా తెలుగు గంగ వెలుగొండ ప్రాజెక్టులను అనుమతులు లేని ప్రాజెక్టుల జాబితాలో చేర్చి కేంద్ర ప్రభుత్వం దురాగతానికి తలపడింది. ఇంత జరిగిన తరవాత కూడా వినే వాళ్ళు వుంటే చెప్పే వాళ్లకు కొదవ లేదన్నట్లు సీమ డిక్లరేషన్ పేర రాష్ట్ర బిజెపి హడావుడి చేసింది. పైగా ఏనిమిదేళ్లు గడుస్తున్నా రైల్వే జోన్ కాగితాలకే పరిమితం అయింది. నిత్యం దేవుళ్లకు మొక్కే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కలియుగ దైవ క్షేత్రంగా భావించే తిరుపతిలో 2014 ఎన్నికల సభలో ఎపికి ప్రత్యేక హోదా ఇస్తానని చెప్పి నిస్సిగ్గుగా ఎగ్గొట్టడం గురించి కమల నాథులు ఏమని సమాధానం చెబుతారు? రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 90 మేరకు కేంద్ర ప్రభుత్వం తన నిధులతో పోలవరం ప్రాజెక్టు నిర్మించి ఇవ్వవలసి వుండగా ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు కీలకమైన రెండవ డిపిఆర్ పెట్టుబడి అనుమతి ఆమోదించలేదు. రోజుకొక కుంటి సాకు చెప్పి కేవలం ఒక బ్యారేజీగా నిర్మించే దుర్మార్గపు యత్నాలు జరుగుతున్నాయి. పోలవరం ప్రాజెక్టు రెండవ డిపిఆర్ పెట్టుబడి గురించి బిజెపి నేత సోము వీర్రాజు గాని రాష్ట్రానికి రానున్న ప్రధాన మంత్రితో పాటు బిజెపి జాతీయ అధ్యక్షుడు నడ్డా రాష్ట్ర ప్రజలకు జవాబు చెప్పవలసి వుంది? ఐఐటీ, ఎయిమ్స్ ఇతర జాతీయ సంస్థల గురించి ఊక దంపుడు ఉపన్యాసాలు చెబుతారు! కాని ఇవన్నీ ఈపాటికే అన్ని రాష్ట్రాల్లో వున్నాయి. కొత్తగా ఏర్పడిన ఎపికి ఇవ్వలేదు. లోటు బడ్జెట్ పూడ్చేందుకు ప్రత్యేక హోదాకు బదులుగా అయిదేళ్ల కాలంలో 22 వేల కోట్ల రూపాయలు గ్రాంటుగా ఇచ్చినట్లు కేంద్రమంత్రులు, బీజేపీ నేతలు చెబుతుంటారు. ఇది పచ్చి అబద్ధం. 14 వ ఆర్థిక సంఘం కేంద్ర పన్నుల వాటా లభించిన తర్వాత కూడా లోటు వున్న కొన్ని రాష్ట్రాలకు గ్రాంటు మంజూరు చేసింది. మన పక్కనే వున్న తమిళనాడు బిహార్ తదితర రాష్ట్రాలు ఈ జాబితాలో వున్నాయి. కాని కమల నాథులు ఈ అంశం మరుగుపర్చి ఎపికి ప్రత్యేకంగా ఇచ్చినట్లు ప్రచారం చేస్తున్నారు.

అంతేకాదు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో వ్యాపించిన బుందేల్‌ఖండ్‌కు సాగు నీరందించే నిన్న గాక మొన్న ఆమోదం పొందిన కెన్-బెత్వా ప్రాజెక్టుకు తాగునీటి వ్యయం కలుపుకొని 44,605 కోట్లు భరించేందుకు ఆమోదం తెలిపి బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం పొందుపర్చి ఈ ఏడు 6700 కోట్ల రూపాయలు కేటాయించారు. కాని ఇంతవరకు ఏ సంవత్సరమైనా పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు ఎందుకు కేటాయించలేదో సోము వీర్రాజుతో పాటు కమల నాథులు రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పి తదుపరి ఓట్లు అడగవలసి వుంది. పైగా పోలవరం ప్రాజెక్టులో తాగునీటి వ్యయం తాము భరించబోమనే షరతు పెడుతున్నారు. కెన్-బెత్వా ప్రాజెక్టులో తాగునీటి వ్యయం కేంద్రం భరిస్తోంది. ఇదెక్కడి న్యాయం? 2014 ఫిబ్రవరి 20వ తేదీ రాజ్యసభలో రాష్ట్ర విభజన చట్టం చర్చ సందర్భంగా అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ మాట్లాడుతూ బుందేల్ ఖండ్ ప్రాంతానికి అమలు చేసిన తరహాలోనే ఎపిలోని వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ అమలు జరుగుతుందని చట్ట సభ సాక్షిగా ప్రకటన చేశారు. అయితే ప్రధాన మంత్రి మోదీ ప్రత్యేక ప్యాకేజీకి పంగనామాలు పెట్టారు. ఏతావాతా తేలేదేమంటే ప్రధాన మంత్రి మోదీ రాజకీయ ప్రయోజనం లేనిదే చీపురు పుల్లంత పథకం కూడా అమలు చేయడని ఈ పాటికే స్పష్టమైంది.

దక్షిణ భారత దేశంలో కర్నాటక తప్ప (రేపు ఎన్నికల్లో ఏమౌతుందో) మిగిలిన రాష్ట్రాల ముఖ్యమంత్రులు జగన్మోహన్ రెడ్డి మినహా అందరూ కేంద్రానికి వ్యతిరేకంగా వున్నారు. పార్టీ వేరే గాని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి అన్ని విధాలా అండదండలు ఇస్తున్న నేపథ్యంలో ఏది ఏమైనా తాము అధికారంలోకి రాలేము కాబట్టి జగన్మోహన్ రెడ్డిని ఓడించేందుకు కేంద్ర బిజెపి నాయకత్వం సిద్ధంగా లేదు. సోము వీర్రాజుకు ఈ అంశం తెలుసు. రాష్ట్రంలో ద్విముఖ లేక బహుముఖ పోటీ జరిగితే తిరిగి జగన్ సులభంగా అధికారం చేపట్టే అవకాశాలు వున్నందున అందుకు అనువుగా కమల నాథులు పావులు కదుపుతూ పగటి కలలు కన్నట్లు నటిస్తున్నారు.

వ్యాస రచయిత విశ్రాంత పాత్రికేయులు
9848394013

తిరోగమన విధానాలపై
తిరుగుబాటు

- ఆదర్శంగా నిలుస్తున్న 'హెర్వాడ్' గ్రామం
- వితంతు ఆచారాలు నిషేధిస్తూ తీర్మానం

ముంబై: మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లా శిరోల్ తాలూకాలోని ఓ గ్రామం హెర్వాడ్. అన్ని గ్రామాలుగానే సాదాసీదాగా ఉంటే మిగతా అన్ని ఊర్ల మాదిరిగానే అనామకంగా నిలిచిపోయేది. కానీ, హెర్వాడ్ పేరు యావత్ దేశంలో మారుమోగుతున్నది. ఇందుకు కారణం అక్కడ మహిళలకు దక్కుతున్న గౌరవం. మహిళలు, ప్రత్యేకించి వితంతువుల పట్ల తరతరాలుగా సమాజం అనుసరిస్తూ వస్తున్న తిరోగమన విధానాలపై ఈ గ్రామం తిరుగు బాటు చేసింది. మహిళలు గౌరవంగా జీవించే హక్కు కోసం వింతంతువుతో ముడిపడి ఉన్న అన్ని ఆచారాలను నిషేధిస్తూ ఇటీవల గ్రామ సభ తీర్మానాన్ని ఆమోదించింది. ఇలాంటి చట్టం కోసం మహారాష్ట్ర ప్రభుత్వంపై నేడు ఒత్తిడి పెరుగుతున్నది. ఒక గ్రామం ఈ స్థాయిలో చైతన్యం పొందడం ప్రశంసనీయం. 'హెర్వాడ్ మోడల్' పేరుతో గ్రామంలో తీసుకున్న నిర్ణ యాలకు మంచి ప్రశంసలు లభిస్తున్నాయి. యావత్ దేశానికి దిశానిర్దేశనం చేస్తున్నాయి. తరతరాలుగా వస్తున్న ఆచారాలను హెర్వాడ్ గ్రామ పంచాయితీ తోసిపుచ్చింది. వితంతు మహిళ మంగళసూత్రం, కాలి మెట్టెలను తీసివేయడాన్ని, నుదటి మీద బొట్టు చెరిపి వేయడానికి అంతంపలికింది. గాజులు పగలగొట్టడం వంటి అత్యంత దుర్మార్గమైన ఆచారాలను నిషేధిస్తూ ఏకగ్రీ వంగా తీర్మానాన్ని ఆమోదించింది. ఆచారాల ప్రకారం వితంతువులు సామాజిక, మతపరమైన సమావేశాలు, కార్యక్రమాలకు హాజరుకాకూడదన్న ఆంక్షలను కూడా ఎత్తివేసింది. ఈ మార్పు కోసం నిరంతరం కృషి చేసిన వారంతా ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని కూడా ఇలాంటి చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. ఇది ఆహ్వానించతగ్గ పరిణామం. అనుసరణీయం కూడా.

వితంతువుల గౌరవాన్ని కాపాడడానికి, హక్కులను

పరిరక్షించ డానికి హెర్వాడ్ గ్రామపంచాయతీ పాలక వర్గం పడుతున్న తపనతోనైనా యావత్ దేశానికి కనువిప్పుకావాలి. మూఢవిశ్వాసాలతో మహిళలను బానిసలుగా చూసే సంస్కృతికి తెరపడాలి. సమతావాది, సంస్కర్త మహాత్మా ఫూలే పేరు మీద ఏర్పాటైన ఒక స్వచ్ఛంద సంస్థ ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళు తున్నది. ఆ సంస్థ కృషి ఫలితంగానే, దేశంలోనే వితంతువుల విషయంలో అనుసరిస్తున్న తిరోగమన విధానాలకు వ్యతిరేకంగా తీర్మానాన్ని ఆమోదించిన తొలి గ్రామంగా హెర్వాడ్ చరిత్ర పుటల్లోకి ఎక్కింది. ఇలాంటి చట్ట ఆవసరాన్ని మహారాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ నీలం గోర్లే కూడా గుర్తించారు. జులైలో జరిగే రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఉభయ సభల్లోనూ ఈ అంశాన్ని లేవనెత్తడమే గాక, చర్చ జరుపుతామని ఆమె హామీ ఇచ్చారు. హెర్వాడ్ గ్రామ పంచాయితీ తరహాలో ఒక చట్టాన్ని తీసుకురావడం అనుకున్నంత సులభం కాకపోవచ్చు. కానీ, ఇప్పుడు పడిన మొదటి అడుగు రేపు అందుకో బోయే లక్ష్యాన్ని దగ్గర చేస్తుందనేది వాస్తవం. వితంతు వుల పట్ల సమాజం అనుసరిస్తున్న దారుణ వైఖరిని కూకటివేళ్లతో పెకళించేందుకు కొత్త చట్టం లేదా చట్టాలు అవసరమా? లేక ఉన్న చట్టాలను సవరించి, పకడ్బందీగా అమలు చేస్తే సరిపోతుందా? అనే అంశంపైన కూడా జోరుగా చర్చ జరుగుతున్నది. ప్రతిపాదిత చట్టం లేదా చట్టాలలో ఉండాల్సిన నిబంధనలపై కూడా ఫూలే స్వచ్ఛంద సంస్థకు ఒక స్పష్టమైన అవగాహన ఉంది. వాటిలో కొన్నింటిని హెర్వాడ్ గ్రామం ఇప్పటికే ఆమోదించి, అమలు చేస్తున్నది. మహారాష్ట్ర ప్రభుత్వానికి ఫూలే సంఘం చేస్తున్న సిఫార్సులను అనుసరించి భర్త చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న మహిళను వికృత ఆచారాలతో హింసించే ఇతర వితంతువులు, ఈ తతంగం జరగడాన్ని మౌనంగా చూసే బంధువులతో పాటు అంత్యక్రియలు, కర్మకాండల్లో పాల్గొనే గ్రామస్థు లను కూడా నేరస్థులుగానే పరిగణించాలి. వితంతువులను ఉద్దేశించి, వారికి మాత్రమే అమలు చేస్తున్న తిరోగమన చర్యలకు మద్దతనిస్తున్న మహిళలకు మూడు నెలల నుంచి ఏడాది జైలు శిక్షతో పాటు 5వేల నుంచి లక్ష రూపాయల వరకూ వారి పాత్ర తీవ్రతను బట్టి జరిమానా విధించాలి. బంధువులకు 15 రోజుల నుంచి నెల రోజుల జైలు, 5,000 నుంచి 50,000 రూపాయల జరిమానా విధించాలి. ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్న సందర్భాల్లో, అంత్యక్రియలకు హాజరైన వారిని ఒక రోజుపాటు గృహం లేదా గ్రామందాటి బయటకు వెళ్ల కుండా నిరోధించాలి. కింది స్థాయిలో చట్టాన్ని ఉల్లంఘించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఉల్లంఘనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ యావత్ ప్రక్రియ పర్యవేక్షణకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలి. అందులో కనీసం 50 శాతం మంది మహిళలు ఉండేలా చూడాలి. అంతేగాక, ఆ మహిళల్లో 50 శాతం మంది వితంతువులే ఉండేలా జాగ్రత్తపడాలి. గ్రామలేదా వార్డు పరిధిలో ఎవరైనా పురుషుడు మృతి చెందితే, అక్కడికి కమిటీ నుంచి కనీసం ఇద్దరు సభ్యులు వెళ్లాలి. భర్తను దూరం చేసుకున్న మహిళ పట్ల అవమాన కరంగా ఎవరూ వ్యవహరించకుండా చూడాలి. అంత్యక్రి యల ప్రక్రియను వీడియో తీసే శిక్షణను కమిటీ సభ్యులకు ఇప్పించాలని ఫూలే కమిటీ తన సిఫార్సులలో పేర్కొన్నది.

వారు కొన్ని గంటల పాటు కోటీశ్వరులయ్యారు!

చెన్నై: తమ ఖాతాల్లో కోట్లు జమయినట్టు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు చెన్నై ఖాతాదార్ల ఫోన్లకు మేసేజ్‌లు రావడంతో వారంతా కొన్ని గంటల పాటు కోటీశ్వరులయ్యారు. సాంకేతిక లోపంతో ఇలా జరగడంతో అనేకమంది ఖాతాదార్లకు ఇలాంటి మెసేజ్‌లు వెళ్లాయి. టీ నగర్ బ్రాంచ్‌కు చెందిన 100 ఖాతాల్లో భారీగా నగదు డిపాజిట్ అయినట్టు మెసేజ్‌లు వచ్చాయి. కొన్ని ఖాతాల్లో రూ.13 కోట్లు క్రెడిట్ అయినట్టు మెసేజ్‌లు రావడంతో వారు బ్యాంకుకు వెళ్లి ఆరా తీశారు. తన బ్యాంకు ఖాతా హ్యాక్ అయిందనే భయంతో ఒక ఖాతాదారు చెన్నై పోలీసులకు సమాచారం అందించడంతో ఈ వ్యవహారం వెలుగుచూసింది. పోలీసులు బ్రాంచ్ అధికారులను సంప్రదించారు. సాంకేతిక లోపం కారణంగా డెబిట్, క్రెడిట్ అప్‌డేట్స్ కలిసిపోవడంతో ఇలా జరిగిందని బ్యాంకు అధికారులు గుర్తించారు. తమ బ్యాంకు ఖాతాల్లో భారీగా నగదు జమయినట్టు వచ్చిన మెసేజ్ స్క్రీన్‌షాట్‌లను అనేకమంది ఖాతాదారులు ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. తన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాలో ఆదివారం రూ 2.49 కోట్ల బ్యాలెన్స్ ఉన్నట్టు మెసేజ్‌లో కనిపించిందని ఒక ఖాతాదారు ట్వీట్ చేశాడు. ఆదివారం ఉదయం తన భార్య ఖాతాలో రూ 1.23 కోట్ల జమవగా మధ్యాహ్నానికి ఆ మొత్తం కనిపించలేదని మరో ఖాతాదారు పోస్ట్ చేశారు. వంద ఖాతాల్లో ఒక్కొక్కరి ఖాతాలో రూ 13 కోట్లు క్రెడిట్ అయ్యాయని సమాచారం రాగా అన్ని ఖాతాల్లో వేర్వేరు మొత్తాలు క్రెడిట్ అయ్యాయని బ్యాంకు అధికారులు ధ్రువీకరించారు. సాఫ్ట్‌వేర్ లోపంతోనే ఇలా జరిగిందని ఎలాంటి హ్యాకింగ్ జరగలేదని బ్యాంకు అధికారి స్పష్టంచేశారు. ఈ సమస్యను అధిగమించేందుకు ఆయా ఖాతాలను తాత్కాలికంగా నిలుపుదల చేశామని తెలిపారు.

కోల్‌కతాలో మరో మోడల్ ఆత్మహత్య
రెండు వారాల్లో నలుగురి మృతి

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో మోడల్స్ వరుస ఆత్మహత్యలు కలకలం రేపుతున్నాయి. ఆదివారం మరో మోడల్ ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో రెండు వారాల్లో మరణించిన మోడల్స్ సంఖ్య నాలుగుకు చేరింది. మోడల్, మేకప్ ఆర్టిస్ అయిన 18 ఏళ్ల సరస్వతి దాస్ ఆదివారం కస్బా ప్రాంతం బేడియాదంగాలోని తన ఇంట్లో ఉరి వేసుకుని కనిపించినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. చిన్న చిన్న వెంచర్‌లకు మోడల్‌గా మారి అనేక ఆఫర్లను అందుకున్న దుపట్టాతో ఉరివేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందని సీనియర్ పోలీసు అధికారి ఒకరు చెప్పారు. సరస్వతి అమ్మమ్మ తొలుత చూసి కూరగాయలు కత్తిరించే కట్టర్‌తో దుప్పట్టాను కోసి ఆమె మృతదేహాన్ని కిందకు దించి వెంటనే ఆసుపత్రికి తరలించినట్లు ఆ వృద్ధురాలు తమకు చెప్పిందన్నారు. అయితే పోస్ట్‌మార్టం రిపోర్ట్ కోసం ఎదురు చూస్తున్నామని చెప్పారు. కాగా, కోల్‌కతాలో ఇటీవల మరణించిన ముగ్గురు మోడల్స్‌తో సరస్వతికి ఏమైనా సంబంధం ఉందా అన్నదానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సరస్వతి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఆమె సోషల్ మీడియా యాక్టి విటీ, ఇతర అంశాలను పరిశీలిస్తున్నారు. ఆమె తీవ్ర నిర్ణయం తీసుకున్న సమయంలో తల్లి, పిన్ని ఇంట్లో లేరని పోలీసులు తెలి పారు. సరస్వతి చిన్నప్పుడే తండ్రి కుటుంబాన్ని వీడటంతో తల్లి, పిన్ని పనులు చేస్తూ ఆమెను పెంచి పెద్ద చేశారని వివరించారు. మరోవైపు గత బుధవారం మోడల్ బిదిషా డి మజుందార్ ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన 26 ఏళ్ల మోడల్ మంజుషా నియోగి శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించారు. ఈ రెండు ఘటనలకు ముందు ఈ నెల 15న మోడల్, టీవీ నటి పల్లవి డే గార్ఫా ప్రాంతంలోని అపార్ట్‌మెంట్‌లోని అద్దె ఇంట్లో అనుమానాస్పదంగా మరణించారు. వీరు ముగ్గురు కూడా ఆత్మహత్య చేసుకున్నట్లుగా అనుమానించిన పోలీసులు ఆ మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

అభిషేక్‌పై ఏ చర్యలు తీసుకున్నారు
బెంగాల్ సీఎస్‌ను కోరిన గవర్నర్ ధన్‌ఖర్

కోల్‌కతా: టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ న్యాయవ్యవస్థపై హద్దు మీరి చేసిన వ్యాఖ్యపై తీసుకున్న చర్యలేమిటో తెలపాలని బెంగాల్ గవర్నర్ జగ్‌దీప్ ధన్‌ఖర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరారు. ఆయనపై ఏ చర్యలు తీసుకున్నారో జూన్ 6 వతేదీలోపు తనకు తెలపాలంటూ ట్వీట్ చేశారు. ఎన్నికల అనంతర హింస, ఉపాధ్యాయ నియామకాల్లో కుంభ కోణం కేసులను సీబీఐకి అప్పగిస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై అభిషేక్ బెనర్జీ చేసిన వ్యాఖ్యలు న్యాయవ్యవస్థను అవమానించినట్టేనని పేర్కొంటూ ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆదివారమే సీఎస్‌ను ఆదేశించిన విషయం విధితమే. న్యాయమూర్తులు అన్ని కేసులను సీబీఐకి అప్పగిస్తు న్నారని పేర్కొంటూ అభిషేక్ న్యాయవ్యవస్థను అవమానించారని, న్యాయవ్యవస్థపై ఆయన జోక్యం ఎందుకని ప్రశ్నించారు. ఇటువంటి వారిపై చర్యలు తీసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పేర్కొన్నారు.

పత్తిపై దిగుమతి సుంకం మాఫీ
త్వరితగతిన ఖరారుకు కేంద్ర మంత్రి గోయెల్ ఆదేశం

న్యూఢిల్లీ: ప్రస్తుత సీజన్‌లో పత్తి, నూలు ధరల్లో మునుపెన్నడూ లేని రీతిలో పెరుగుదల చోటుచేసుకోవడంతో కేంద్రం పత్తిపై దిగుమతి సుంకాన్ని మాఫీ చేసింది. డిసెంబర్ 31 వరకు పత్తిపై దిగుమతి సుంకం మాఫీ పొడిగింపునకు సంబంధించి 'వీలైనంత త్వరగా ఖరారు' చేయాలని సంబంధిత అధికారులను కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ ఆదేశించారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా పత్తి ధరను తగ్గించేందుకు ప్రభుత్వం గత నెలలో, సెప్టెంబర్ 30 వరకు పత్తి దిగుమతిపై అన్ని కస్టమ్స్ సుంకాలను మినహాయించింది. ప్రస్తుతం పత్తి సరఫరాలను పెంచడం, ఉత్పత్తిన బలోపేతానికి సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం కేంద్ర జౌళి, వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ శనివారం ముంబైలో నూతనంగా ఏర్పాటయిన టెక్స్‌టైల్ అడ్వయిజరీ గ్రూప్‌తో ఒక ముఖాముఖి సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి గోయెల్ మాట్లాడుతూ ప్రస్తుత అవసరాన్ని తీర్చడానికి, నిల్వ అందుబాటులో ఉన్న ప్రాంతాల నుంచి దిగుమతిని సులభతరం చేయడం, విధానపరమైన అవసరాలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 'దిగుమతి ద్వారా స్వల్పకాలిక వృద్ధికి సంబంధించిన విధానాలను ప్రస్తావిస్తూ, జౌళి శాఖ కార్యదర్శి ఉపేంద్ర ప్రసాద్ సింగ్... కొన్ని గమ్యస్థానాల నుంచి దిగుమతి చేసుకోవడానికి విధానపరమైన అవసరాల కోసం వ్యవసాయం, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖను సంప్రదించాలని

పరిశ్రమకు సూచించారు' అని ఒక అధికారిక ప్రకటన తెలిపింది. 'డిసెంబర్ 31, 2022 వరకు దిగుమతి సుంకం మినహాయింపు కాలాన్ని పొడిగించడానికి సంబంధించి, మంత్రి గోయెల్ ఈ విషయాన్ని ముందుగానే ఖరారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు' అని వివరించింది. టెక్స్‌టైల్ అడ్వయిజరీ గ్రూప్ చైర్మన్ సురేష్ కోటక్ మాట్లాడుతూ ముఖ్యంగా కొత్త ప్రారంభ పరిపక్వ రకాలను విత్తడానికి విత్తన లభ్యతను నిర్ధారించాల్సిన అవసరాన్ని, ప్రస్తుత స్తబ్దత నుంచి భారత దేశ పత్తి ఉత్పాదకతను పెంచడానికి విత్తన వ్యవస్థను పునరుద్ధరించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. 'ప్రస్తుతం పత్తి లభ్యతపై స్థానం వచ్చింది. అంతర్జాతీయంగా మూడు వనరుల నుంచి సకాలంలో రవాణా జరిగేలా లాజిస్టిక్స్‌కు సహాయం చేయమని అభ్యర్థన కూడా చేశాం' అని జౌళి మంత్రిత్వ శాఖ ప్రకటన తెలిపింది. కాగా సురేష్ కోటక్ మాట్లాడుతూ పత్తి ఉత్పత్తి, వినియోగంపై కమిటీ అంచనాల ప్రకారం, తీసుకువెళ్లడం, నిల్వ ముగింపు 41.27 లక్షల బేళ్లు అని తెలిపారు. ఇది 45 రోజుల వినియోగ నిల్వకు సమానం. 2021 ఫిబ్రవరిలో పత్తిపై 11 శాతం దిగుమతి సుంకం విధించినప్పుడు పత్తి ధర రూ.44,500 నుంచి మార్చి 2022లో రూ.90 వేలకు పెరిగినందున, ప్రధానంగా పత్తి ఆధారిత వస్త్ర పరిశ్రమ పత్తి రంగంలో దీర్ఘకాలంగా మాంద్యాన్ని ఎదుర్కొంటోంది. పత్తి ధర విపరీతంగా పెరగడం, నూలు, వస్త్రాల ధరలపై దాని ప్రభావం పత్తి వస్త్ర విలువ గొలుసు సంభావ్య వృద్ధిని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. కేంద్ర పరోక్ష పన్నులు, సుంకాల బోర్డు (సీబీఐసీ) పత్తి దిగుమతికి కస్టమ్స్ సుంకం, వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధి సుంకం నుంచి మినహాయింపు ప్రకటించింది. కాగా కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన ఈ సుంకం మినహాయింపు ఏప్రిల్ 14, 2022 నుంచి సెప్టెంబర్ 30, 2022 వరకు అమలులో ఉంటుంది. ముడి పత్తిపై 5 శాతం ప్రాథమిక కస్టమ్స్ సుంకం, 5 శాతం వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధి సెస్‌ను తొలగించాలని పరిశ్రమ డిమాండ్ చేస్తోంది.

'విష వలయం' నుంచి
దేశం బయటపడుతోంది

- పేదల జీవన సౌలభ్యానికి ప్రయత్నించాం
- ప్రపంచ వ్యాప్తంగా భారతదేశ సత్తా పెరిగింది: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: అవినీతి, కుంభకోణాలు, బంధుప్రీతి, దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న ఉగ్రవాద సంస్థలు, ప్రాంతీయ వివక్షతతో 2014కి ముందు చిక్కుకున్న 'విష వలయం' నుంచి భారతదేశం బయటపడుతోందని ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం అన్నారు. తమ ప్రభుత్వం ఎనిమిదేళ్లు పేదల సంక్షేమానికి అంకితమయ్యిందని తెలిపారు. ఎనిమిదేళ్ల పాలన పూర్తి చేసుకుంటున్న వేళ దేశం పట్ల ఉన్న విశ్వాసం, ప్రజల ఆత్మవిశ్వాసం అపూర్వమైనవని ప్రధాని సంతోషం వ్యక్తం చేశారు. పీఎం-కేర్స్ ఫర్ చిల్డ్రన్ స్కీమ్ కింద ప్రయోజనాలను విడుదల చేసిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కోవిడ్ ప్రతికూల ప్రభావం నుంచి బయటపడి ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ మారిందని మోదీ అన్నారు. ప్రపంచం కొత్త ఆశలు, విశ్వాసంతో దేశం వైపు చూస్తోందని అన్నారు. 2014కు ముందు ఇరుక్కున్న అవినీతి, వేల కోట్ల కుంభకోణాలు, బంధుప్రీతి, ఉగ్రవాద సంస్థలు, ప్రాంతీయ వివక్ష వంటి విష వలయాల నుంచి దేశం బయటపడుతోంది' అని మోదీ గత కాంగ్రెస్ పాలనను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 'అత్యంత కష్టతరమైన రోజులు కూడా గడిచిపోతాయనడానికి పిల్లలైన మీకు ఇది ఒక ఉదాహరణ' అని ఆయన అన్నారు. స్వచ్ఛ్ భారత్ మిషన్, జన్ ధన్ యోజన లేదా హర్ ఘర్ జల్ అభియాన్ వంటి సంక్షేమ విధానాలను ప్రస్తావిస్తూ, సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ స్ఫూర్తితో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మోదీ చెప్పుకొచ్చారు. కుటుంబ సభ్యునిగా మేము కష్టాలను తగ్గించడానికి, దేశంలోని పేదల జీవన సౌలభ్యాన్ని మెరుగుపరచడానికి ప్రయత్నించాం' అని ప్రధాని తెలిపారు. సాంకేతికత వినియోగాన్ని పెంచడం ద్వారా పేదలు వారి హక్కులు పొందేలా ప్రభుత్వం హామీ ఇచ్చిందని అన్నారు. ఇప్పుడు నిరుపేదలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటారనే నమ్మకం ఉందని తెలిపారు. ఈ నమ్మకాన్ని పెంచేందుకు తమ ప్రభుత్వం ఇప్పుడు 100 శాతం సాధికారత ప్రచారాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. గత ఎనిమిదేళ్లలో భారతదేశం సాధించిన ఎత్తులు ఇంతకు ముందు ఎవరూ ఊహించలేరని, నేడు ప్రపంచ వ్యాప్తంగా భారతదేశ సత్తా పెరిగిందని అన్నారు. ఈ భారత యాత్రకు యువశక్తి నాయకత్వం వహిస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. 'మీ కలల కోసం మీ జీవితాన్ని అంకితం చేయండి, అవి సాకారమవుతాయి'అని ప్రధాన మంత్రి అన్నారు. మోదీ మొదటిసారిగా మే 26, 2014న ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టగా, రెండోసారి మే 30, 2019న ప్రమాణ స్వీకారం చేశారు.

మరోసారి తెరపైకి హిజాబ్ వివాదం

మంగళూరు: కర్ణాటకలో మరోసారి హిజాబ్ వివాదం తెరపైకి వచ్చింది. హిజాబ్ ధరించిన ముస్లిం విద్యార్థినులు శనివారం మంగళూరు యూనివర్సిటీ కళాశాలకు రాగా వారిని అధికారులు అనుమతించలేదు. మళ్లీ సోమవారం కూడా వారు హిజాబ్ ధరించే వచ్చారు. మళ్లీ అధికారులు కళాశాలలోకి రానివ్వలేదు. ప్రత్యేక డ్రెస్ కోడ్ ఉన్నందున దానిని పాటించాలని విద్యార్థులకు సూచించారు. అనుమతించాలంటూ విద్యార్థినులు పదేపదే డిమాండ్ చేస్తుండడంతో డిస్ట్రిక్ట్ డెప్యూటీ కమిషనర్‌ను ఆశ్రయించాలని యూనివర్సిటీ అధికారులు సూచించారు. దీంతో విద్యార్థినులు దక్షిణ కన్నడ జిల్లా డెప్యూటీ కమిషనర్(డీసీ) రాజేంద్రను కలిసి, కళాశాల ప్రాంగణంలో ఇస్లామిక్ హెడ్‌స్కార్ఫ్(హిజాబ్) ధరించేందుకు అనుమతించాలని, విద్యాసంస్థల్లో హిజాబ్ ధరించేందుకు మార్గం సుగమం చేయాలని కోరారు. ఈ మేరకు 12 మంది విద్యార్థినులు కమిషనర్‌కు మెమొరాండం సమర్పించారు.

హైకోర్టు ఆదేశాలకు కట్టుబడాల్సిందే...

ఈ వ్యవహారంపై డెప్యూటీ కమిషనర్ రాజేంద్ర స్పందిస్తూ... కళాశాల నిర్దేశించిన యూనిఫాంకు కట్టుబడి ఉండాలని విద్యార్థినులకు సూచించానని చెప్పారు. యూనివర్సిటీ అధికారులు హైకోర్టు ఆదేశాల ప్రకారం నడుచుకుంటున్నారని, హిజాబ్ ధరించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం లోపలికి అనుమతించడంలేదని చెప్పారు. విద్యా ప్రాంగణాల్లో హిజాబ్ లేదా కాషాయ వస్త్రాలు ధరించడం వల్ల శాంతికి విఘాతం కలిగే అవకాశాలున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి ప్రయోజనాల దృష్ట్యా జిల్లా స్థాయిలో తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేయొద్దని విద్యార్థినులకు సూచించానని రాజేంద్ర చెప్పారు. చట్టపరమైన అంశాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని, కళాశాల ఆవరణలో శాంతి, సామరస్యాల గురించి ఆలోచించాలని విద్యార్థినులకు సూచించానన్నారు. ఈ విషయంపై మంగళూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ పీ సుబ్రమణియం యడపడితయ మాట్లాడుతూ... హైకోర్టు, రాష్ట్రప్రభుత్వ ఆదేశాలకు యూనివర్సిటీ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. ఆదేశాల అమలులో ఏ విద్యార్థినికైనా సమస్య ఉంటే పరిష్కరించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామని ఆయన తెలిపారు.

త్రిపుర అసెంబ్లీ ఉప ఎన్నికలు...
అభ్యర్థులను ప్రకటించిన లెఫ్ట్ ఫ్రంట్

అగర్తల: త్రిపురలోని నాలుగు స్థానాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో విజయదుంధుభి మోగించాలని వామపక్ష కూటమి కసరత్తు ప్రారంభించింది. వివిధ కారణాలతో రాష్ట్రంలోని అగర్తల, బర్దోవాలి, సుర్మా, జుబారాజ్‌నగర్‌లలో వచ్చే నెల 23న జరుగనున్న ఉప ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులను నిర్ణయించింది. ఉప ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా సోమవారం ప్రత్యేకంగా భేటీ అయిన లెఫ్ట్ ఫ్రంట్ నాయకత్వం అభ్యర్థుల ఎంపికను పూర్తి చేసింది. అనంతరం లెఫ్ట్ ఫ్రంట్ కన్వీనర్ నారాయణ్ కర్ విలేకరులతో మాట్లాడుతూ ఉప ఎన్నికల్లో వామపక్ష కూటమి తరపున బరిలో నిలువనున్న అభ్యరుల పేర్లను వెల్లడించారు. అగర్తల నుంచి గతంలో ఓటమి పాలైన సీపీఎం నేత క్రిషన్ మజుందార్, త్రిపుర జిల్లాలోని టౌన్ బర్దోవాలి నియోజకవర్గం నుంచి ఫార్వర్డ్ బ్లాక్‌కు చెందిన నేత రఘునాథ్ సర్కార్, సుర్మా నియోజకవర్గం నుంచి సీపీఎం మాజీ ఎమ్మెల్యే అంజన్ దాస్, జుబారాజ్‌నగర్ నియోజకవర్గం నుంచి సీపీఎం నేత శైలేంద్ర చంద్రనాథ్ పోటీ చేయనున్నట్టు ప్రకటించారు. అభ్యర్థులు రెండు రోజుల్లో తమ నామినేషన్‌లు దాఖలు చేస్తారని తెలిపారు. 2018 అసెంబ్లీ ఎన్నికల అనంతరం జరిగన ఏ ఎన్నికలూ స్వేచ్ఛగా జరగలేదని గుర్తు చేస్తూ ఉప ఎన్నికల్లో బీజేపీ కుట్రలకు తెరలేపే అవకాశం ఉన్నందున పారామిలటరీ దళాలతో భద్రత కల్పించాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు.

రాజ్యసభ అభ్యర్థులను పున:పరిశీలించాలి
అధిష్ఠానానికి గెహ్లాట్ సలహాదారు విజ్ఞప్తి

జైపూర్: రాజస్థాన్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభకు ఎంపిక చేసిన అభ్యర్థుల ఎంపికను మరోసారి పరిశీలించాలని సీఎం అశోక్ గెహ్లాట్ సలహాదారు, స్వతంత్ర ఎమ్మెల్యే సన్యామ్ లోధా కాంగ్రెస్ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఖాళీకానున్న నాలుగు రాజ్యసభ స్థానాలకు సంబంధించిన అధికార కాంగ్రెస్ మూడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో ఆ లిస్టులో తన పేరు లేకపోడంపై లోధా అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఒక వీడియోను విడుదల చేశారు. రాష్ట్రానికి సంబంధించిన వ్యక్తులకు కాకుండా బయటి వ్యక్తులకు సీట్లు ఇవ్వడం ఏమిటని అంతర్లీనంగా ప్రశ్నించారు. పార్టీ నిర్ణయించిన ముగ్గురిలో రాజస్థాన్‌కు చెందినవారు లేకపోవడంతో రాష్ట్రంలో సరైన అభ్యర్థులు లేరనే సంకేతం బయటకు వెళుతుందని పేర్కొన్నారు. ఇది పార్టీ నేతలు, కార్యకర్తల్లో అపంతృప్తికి దారి తీస్తుందని పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలపైనా ఈ ప్రభావం పడుతుందని అధిష్టానాన్ని హెచ్చరించారు. పార్టీ అధిష్టానానికి సీట్లు కేటాయించే అధికారం ఉన్నప్పటికీ ఈ విషయాలన్నిటినీ పరిగణలోకి తీసుకుని తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తూ కాంగ్రెస్ సంకల్ప్ అనే ట్యాగ్‌తో వీడియోను విడుదల చేశారు. రాజస్థాన్‌లోని నాలుగు రాజ్యసభ స్థానాలకు జూన్ 10న ఎన్నికలు జరగనుండగా ముకుల్ వాస్నిక్, ప్రమోద్ తివారీ, రణదీప్ సింగ్ సూర్జేవాలాకు కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇవ్వగా, బీజేపీ నుంచి ఘనశ్యాం తివారీ అవకాశం దక్కించుకున్న విషయం విధితమే.

మూసేవాలా హత్యపై ఉన్నతస్థాయి విచారణ
హిమాచల్ సీఎం జైరామ్ ఠాకూర్ డిమాండు

సిమ్లా: పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్యపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని హిమాచల్ ప్రదేశ్ సీఎం జై రామ్ ఠాకూర్ పంజాబ్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... సీఎం భగవంత్ సింగ్ మాన్ ప్రభుత్వం ప్రజల్లో గొప్ప అనిపించుకోవడం కోసం మూసేవాలాకు ఉన్న భద్రతను తొలగించడంతోనే ఈ దారుణం చోటుచేసుకుందని ఆరోపించారు. ఆప్ ప్రభుత్వం అధికారం చేపట్టిననాటి నుంచి పంజాబ్‌లో శాంతి భద్రతలు క్షీణించాయని పేర్కొన్నారు. తమ రాష్ట్రంలోని ధర్మశాలలో ఉన్న అసెంబ్లీ గోడకు పంజాబ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు ఖలిస్థాన్ జండా కట్టి నినాదాలు చేశారని, వారిని ఐదు రోజుల్లోనే అరెస్టు చేసినట్టు తెలిపారు. పంజాబ్‌లో ఇటువంటి పరిస్థితి లేదని విమర్శించారు. ఖలిస్థాన్ జండాలతో తిరిగినా, నినాదాలు చేసినా ఆ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాజకీయంగా మైలేజీ పొందడం కోసం 200 మందికి ఉన్న భద్రతను తొలగించారని పేర్కొన్నారు. అవినీతికి పాల్పడిన ఆరోగ్య శాఖ మంత్రి విజయ్ సంఘ్లిని తొలగించిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఆయన గత చరిత్ర తెలియకుండా పదవి ఇచ్చారా అంటూ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం భద్రతను తొలగించడంతోనే మూసేవాలా హత్య జరిగిందని, ఆ ఘటనపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని ఆప్ ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

మూసేవాలాపై ఆ వ్యాఖ్యలు చేయలేదు: పంజాబ్ డీజీపీ

ఛండీగఢ్: పంజాబ్ గాయకుడు సిద్ధూ మూసేవాలాను తాను ఎప్పుడూ గ్యాంగ్‌స్టర్ అని పిలవలేదని, గ్యాంగ్‌స్టర్లతో ఆయనకు సంబంధాలున్నట్టు వ్యాఖ్యానించలేదని పంజాబ్ డీజీపీ వీకే భవ్రా అన్నారు. హత్యకు గురైన సిద్ధూ మూసేవాలకు గ్యాంగ్‌స్టర్‌లతో సంబంధాలున్నాయని డీజీపీ చేసిన వ్యాఖ్యలపై ఆయన తండ్రి బాల్కౌర్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ డీజీపీ బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండు చేశారు. తన కుమారుడి హత్యపై హైకోర్టు న్యాయమూర్తితలో విచారణ జరిపించాలని, డీజీపీ వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని సీఎం భగవంత్ సింగ్ మాన్‌కు లేఖ కూడా రాయడంతో డీజీపీ స్పందించారు. తాను మూసేవాలాపై గ్యాంగ్‌స్టర్ వ్యాఖ్యలు చేయలేదని వివరణ ఇస్తూ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూసేవాలా అంటే తనకు గౌరవం ఉందని, ఆయన పంజాబ్ సాంస్కృతిక చిహ్నమని పేర్కొన్నారు. తాను మూసేవాలకు గ్యాంగ్‌స్టర్‌లతో సంబంధాలున్నట్టు ఎక్కడా వ్యాఖ్యానించలేదని స్పష్టం చేశారు. ఒక వర్గం మీడియాలోనూ, సామాజిక మాధ్యమాల్లో అటువంటి వ్యాఖ్యలు వస్తున్నాయని తెలిపారు. కేసును పూర్తి స్థాయిలో విచారిస్తున్నామని, హత్యకు పాల్పడిన నిందితులను ఎవ్వరినీ వదిలిపెట్టమని పేర్కొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మోదీ పాలన
హోంమంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ: ప్రధానిగా నరేంద్ర మోదీ ఎనిమిదేళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. దేశంలోని పౌరుల కలలు, ఆకాంక్ష లకు అనుగుణంగా మోదీ పాలన సాగిందని చెప్పుకొచ్చారు. ప్రజల కలలకు ఆయన రెక్కలు తొడిగారంటూ వ్యాఖ్యానిస్తూ హిందీలో వరుస ట్వీట్లు చేశారు. మోదీ రూపంలో దేశానికి బలమైన నాయకత్వం అందిందని, అధికారాన్ని సేవా మార్గంగా పరిగణించి ఆయన పాలన సాగించాలరంటూ ప్రశంసలు కురిపించారు. రైతులు, మహిళలు, పేదలకు అనేక హక్కులు కల్పించారని దీంతో వారికి ప్రజాస్వామ్యంపై విశ్వాసం పెరిగిందని పేర్కొన్నారు. ప్రజలంతా దేశాభివృద్ధిలో భాగస్వాముల వుతున్నారని తెలిపారు. మోదీపై 130 కోట్ల మంది ప్రజలు పెట్టుకున్న నమ్మకంతో దేశం అన్ని రంగాల్లో ముందుకెళుతోందని పేర్కొన్నారు. అవిశ్రాతంగా పని చేస్తూ ప్రజల అంచనాలకు అనుగుణంగా మోదీ పాలన సాగుతోందని పేర్కొన్నారు. దేశాన్ని సురక్షితంగా ఉంచడం కోసం కీలక నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు.

ఆ పరిశ్రమల ముడిపదార్థాలపై
కస్టమ్స్ సుంకం తగ్గింపుతో భారీ నష్టం

న్యూఢిల్లీ: ఇనుము, ఉక్కు, ప్లాస్టిక్ తయారీ పరిశ్రమలు వినియోగించే ముడి పదార్థాలపై కస్టమ్స్ సుంకాన్ని తగ్గించడంతో ప్రభుత్వం 10 కోట్ల నుంచి 15 వేల కోట్ల మేర ఆదాయాన్ని కోల్పోతుందని ఆ శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఈ పదార్థాలపై దిగుమతి సుంకాన్ని తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం ఈ నెల 22న నుంచి అమలులోకి వచ్చిందని తెలిపారు. ఉక్కు పరిశ్రమలో వినియోగించే ఫెర్రోనికెల్, కోకింగ్ బొగ్గు సహా మరికొన్ని ముడిపదార్థాల దిగుమతిపై సుంకాన్ని పూర్తిగా మినహాయించినట్టు తెలిపారు. ఇది దేశీయంగా ఉన్న ఉక్కు పరిశ్రమల ఖర్చును తగ్గిస్తుందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ పరిశ్రమల్లో వినియోగించే ముడి సరుకుల దిగుమతి సుంకాన్ని కూడా తగ్గించినట్టు చెప్పారు. ఈ చర్యల కారణంగా 10 నుంచి 15 వేల కోట్ల ఆదాయం కోల్పోయే అవకాశం ఉందని వివరించారు.

గ్రూప్-1 మెయిన్స్ అభ్యర్థుల ఆగ్రహం

- డిజిటల్ మూల్యాంకనంతో అన్యాయం
- సమస్యలను ఆలకించని అధికారులు
- ఏపీపీఎస్సీ కార్యాలయం దగ్గర ఉద్రిక్తత
- బాధితులకు ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ సంఘీభావం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణకు అభ్యర్థుల వినతి

రామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న గ్రూప్-1 అభ్యర్థులు. పక్కన ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గ్రూప్-1 (2018) అభ్యర్థుల ఎంపిక, డిజిటల్ మూల్యాంకనంలో అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ, బాధిత అభ్యర్థులు సోమవారం ఏపీపీఎస్సీ కార్యాలయానికి తరలిరాగా అక్కడ కొంత ఉద్రిక్తత నెలకొంది. ఏపీపీఎస్సీ చైర్మన్, కార్యదర్శిని కలిసి వారి సమస్యలను విన్నవించేందుకు ప్రయత్నించగా ఎవరూ అనుమతించకపోవడంతో తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. 2018, గ్రూప్-1 మెయిన్స్ డిజిటల్ మూల్యాంకనంలో 325 మంది ఇంటర్వ్యూలకు ఎంపికైతే, మాన్యువల్ విధానంలో 124 మందే ఇంటర్వ్యూలకు అర్హత సాధించారు. దీనిపై తమకు న్యాయం చేయాలంటూ బాధిత అభ్యర్థులు కె.శివకుమార్, డి.చంద్రమోహన్, హరికిరణ్, అపర్ణ, కృష్ణమూర్తి ఏపీపీఎస్సీ కార్యాలయానికి రాగా, వారిని అధికారులు ఎవరూ అనుమతించకపోవడంతో ఒకింత ఆగ్రహానికి గురయ్యారు. తర్వాత ఏపీపీఎస్సీ పీఆర్వోకు వినతి పత్రం అందచేశారు. బాధితులకు మద్దతుగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు, డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాము, నాయకులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేత రామకృష్ణను కలిసిన గ్రూప్-1 అభ్యర్థులు

విజయవాడ దాసరి భవన్‌లో సోమవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణకు బాధిత అభ్యర్థులు వినతి పత్రం అందచేశారు. గ్రూప్-1 మెయిన్స్ ఫలితాల్లో అవకతవకలపై జ్యుడీషియల్ కమిటీ ఏర్పాటు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరుతూ అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. జగన్ ప్రభుత్వం, ఏపీపీఎస్సీ అధికారుల చేతకానితనంతో గ్రూప్-1 అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారన్నారు. గ్రూప్-1 మెయిన్స్ ఒకే రకమైన పరీక్షకు రెండు విడతలుగా మూల్యాంకనాలు చేయడం దారుణమని, ఈ తప్పుని సరిదిద్దుకుని ప్రతిభ కలిగిన అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. ఏపీపీఎస్సీ కార్యాలయానికి తమ సమస్యలు తెలిపేందుకు వెళ్లగా చైర్మన్‌గానీ, కార్యదర్శిగానీ అనుమతించలేదంటూ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన అభ్యర్థులకు తక్షణమే ప్రభుత్వం న్యాయం చేయాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రామకృష్ణను కలిసిన వారిలో గ్రూప్-1 అభ్యర్థులు శివకుమార్, చంద్రమోహన్, హరికిరణ్, కృష్ణమూర్తి, మనోహర్, విజయ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు, పృధ్వీ, సాయి ఉన్నారు.

డిజిటల్ మూల్యాంకన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలి: జగన్‌కు రామకృష్ణ లేఖ

గ్రూప్-1 అభ్యర్థుల ఎంపిక, డిజిటల్ మూల్యాంకనంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని, మెయిన్స్‌కు ఎంపికైన వారి పేర్లను తిరిగి మూల్యాంకనం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం జగన్‌కు సోమవారం ఆయన లేఖ రాశారు. 2018లో నాటి ప్రభుత్వం గ్రూప్-1 పోస్టుల కోసం నోటిఫికేషన్ జారీ చేసిందనీ, ఈ పోస్టుల కోసం 325 మందిని ఇంటర్వ్యూ కోసం ఎంపిక చేయాల్సి ఉండగా, మెయిన్స్ పరీక్ష రాసిన తదుపరి 325 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. అప్పటివరకు మాన్యువల్‌గా జరిగిన మూల్యాంకనానికి బదులుగా రాష్ట్ర ప్రభుత్వం హడావుడిగా డిజిటల్ మూల్యాంకన విధానం ప్రవేశపెట్టిందన్నారు. 2021లో ఈ డిజిటల్ మూల్యాంకనం చేసి గ్రూప్-1 ఇంటర్వ్యూలకు అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ విధానంలో ఇంటర్వ్యూకు ఎంపికకాని అభ్యర్థులు తమకు అన్యాయం జరిగిందని హైకోర్టును ఆశ్రయించగా, గ్రూప్-1 మూల్యాంకనం మాన్యువల్‌గా చేయాలని ఆదేశించిందన్నారు. గ్రూప్-1 డిజిటల్ మూల్యాంకనంలో 325 మంది ఎంపికకాగా, హైకోర్టు ఆదేశాలతో చేపట్టిన మాన్యువల్ మూల్యాంకనంలో 124 మంది మాత్రమే అర్హత సాధించారని వివరించారు. గ్రూప్-1 పరీక్ష రాసి డిజిటల్ మూల్యాంకనంలో ఎంపిక కానివారు ఆ తర్వాత ఏకంగా అతి క్లిష్టమైన సివిల్స్‌లో ర్యాంకులు సాధించి ఐఏఎస్, ఐపీఎస్‌లుగా ఎంపికయ్యారని పేర్కొన్నారు. మాన్యువల్ మూల్యాంకనంలో 124 మందే అర్హత సాధించగా, డిజిటల్ మూల్యాంకనంలో 325 మంది అర్హులెలా అయ్యారు? అనే ప్రశ్న తలెత్తుతోందన్నారు. దీంతో గ్రూప్-1 డిజిటల్ మూల్యాంకనంలో కుంభకోణం జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయనీ, ఈ అవకతవకలు ఏపీపీఎస్సీలో జరుగుతున్న వివిధ లోపభూయిష్ట విధానాలకు బలం చేకూరుస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన డిజిటల్ మూల్యాంకనం తమ జీవితాలను చిన్నాభిన్నం చేసేదని అభ్యర్థులు వాపోతున్నారనీ, ఇలాంటి అవకతవకల కారణంగా ప్రజలకు వ్యవస్థలపై నమ్మకం సన్నగిల్లే ప్రమాదముందన్నారు. గ్రూప్-1 అభ్యర్థుల ఎంపిక, డిజిటల్ మూల్యాంకనంలో జరిగిన లోపాలు తదితరాలపై సమగ్రంగా విచారణ చేయాలని, మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థుల పేపర్లను తిరిగి సమగ్ర మూల్యాంకనం చేపట్టాలని డిమాండ్ చేశారు. అభ్యర్థులకు ఎలాంటి సందేహాలు లేకుండా చేయాలని, అప్పుడే ఈ వ్యవస్థపై విశ్వాసం, నమ్మకం పెరుగుతుందని తెలిపారు.

బెంగళూరులో రైతునేతకు అవమానం

రాకేశ్ తికైత్‌పై సిరా చల్లిన నిరసనకారులు : ముగ్గురి అరెస్టు

బెంగళూరు: బీజేపీ పాలిత కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులో అనూహ్య సంఘటన చోటు చేసుకుంది. రైతు సంఘం నేత రాకేశ్ తికైత్‌పై దాడి జరిగింది. ఓ కార్యక్రమానికి హాజరైన తికైత్... మీడియా ముందు మాట్లాడు తున్న సమయంలో హఠాత్తుగా కొంతమంది నిరసనకారులు ఆయన ముఖంపై నల్ల సిరాను చల్లారు. ఆయన పక్కనే ఉన్న యుద్వీర్ సింగ్ ముఖంపై కూడా సిరా చల్లారు. అంతటితో ఆగకుండా వేదికపైకి కుర్చీలు విసిరారు. ఊహిం చని ఘటనతో ముందు దిగ్భ్రాంతి చెందిన తికైత్ అనుచరులు దుండగులపై ఎదురుదాడికి దిగి వారితో తలపడటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రెండు పక్షాల వారు ఒకరిపై ఒకరు కుర్చీలు విసురుకున్నారు. దీంతో కార్యక్రమం రసాభాసగా మారింది. కొడిహల్లి చంద్రశేఖర్ అనే కర్ణాటక రైతు నేత డబ్బు తీసుకుంటూ... ఓ ఛానెల్ స్టింగ్ ఆపరేషన్‌లో దొరికిపోయిన ఘటనకు సంబం ధించి రాకేశ్ తికైత్, యుద్వీర్ సింగ్‌లు వివరణ ఇస్తున్న సమయంలో ఈ దాడి జరిగింది. జరిగిన ఘటనపై తికైత్ స్పందించారు. ప్రభు త్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తమ కార్యక్రమానికి పోలీసులు రక్షణ కల్పించలేదని, ప్రభుత్వం కనుసన్నల్లోనే తనపై దాడి జరిగిందని ఆరోపించారు. దాడి ఘటనపై నిష్పాక్షిక స్వతం త్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరోవైపు దాడికి కారణంగా భావిస్తున్న స్థానిక రైతు నేత చంద్రశేఖర్ అనుచరులను ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నేతల ఖండన : రాకేశ్ తికైత్‌పై దాడి ఘటనను ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఖండించారు. కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు డి.కె. శివకుమార్ తికైత్‌తో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్ఎల్‌డీ) పార్టీ తికైత్‌పై దాడిని సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించింది. దాడికి పాల్పడ్డవారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కర్ణాటక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కాగా ఈ ఘటనపై కర్ణాటక హోంమంత్రి అరగ జ్ఞానేంద్ర మాట్లాడుతూ... 'మేము అధికారులతో మాట్లాడాం...ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి విచారిస్తు న్నారు... ఈ చర్యను నేను తీవ్రంగా నిరసిస్తున్నా... రాజ్యాంగానికి లోబడి తమ భావాలను వ్యక్తీకరించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది' అని చెప్పారు. తికైత్‌ను బీజేపీ నాయకులు లక్ష్యంగా చేసుకున్నారన్న ఆరోపణలను ఆయన త్రోసిపుచ్చారు.

బీజేపీ ప్రభుత్వానిదే బాధ్యత: ఏపీ రైతు సంఘం

రాకేశ్ తికైత్‌పై దాడిని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ సోమ వారం ఓ ప్రకటనలో ఖండించారు. కర్ణాటకలోని బీజేపీ ప్రభుత్వం దీనికి బాధ్యత వహించాలన్నారు. నిందితులను తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

కస్తూర్బా ఉపాధ్యాయుల రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ-అనుబంధ) కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల (కేజీబీవీ) ఉపాధ్యాయుల రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. విజయవాడ హనుమాన్ పేటలోని ఎస్టీయూ భవన్‌లో రాష్ట్ర స్థాయి కస్తూర్బా మహిళా ఉపాధ్యాయుల సదస్సు సోమవారం ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. కనీస వేతన చట్టం అమలు చేయాలని, ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా అన్ని రకాల సెలవులు మాతృత్వ సెలవులు 180 రోజులు, శిశు సంరక్షణ సెలవులు, ప్రత్యేక వార్డెన్ పోస్టులు, ఐచ్ఛిక సెలవులు మంజూరు చేయాలని డిమాండు చేశారు. ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం: ఎస్టీయూ-కేజీబీవీ రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా టి.శేషలత-గుంటూరు, అధ్యక్షులుగా పి.నాగేశ్వరి-కడప, ప్రధాన కార్యదర్శిగా కె.రత్నమాలినిదేవి-ప్రకాశం జిల్లా), కోశాధికారిగా-సిహెచ్.అర్చన-గుంటూరు, సహాధ్యక్షులుగా ఐ.అరుణ-నెల్లూరు, అదనపు కార్యదర్శిగా పి.నాగరత్నమ్మ-కర్నూలు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సిహెచ్.విజయవాణి-గుంటూరు, కార్యదర్శిగా వి.చైతన్య-కృష్ణాజిల్లా, సలహా మండలి సభ్యులుగా ఎల్.సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న, గాజుల నాగేశ్వరరావు, సీహెచ్. జోసఫ్ సుధీర్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హవాలా కేసులో ఢిల్లీ ఆరోగ్యమంత్రి అరెస్టు

న్యూఢిల్లీ: ఢిల్లీ ఆరోగ్యశాఖ మంత్రి సత్యేందర్ జైన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసింది. కోల్‌కతా కేంద్రంగా పనిచేసే ఓ సంస్థతో సంబంధమున్న హవాలా కేసులో ఆయన్ను సోమవారం అదుపులోకి తీసుకుంది. జైన్ కుటుంబం, కంపెనీలకు చెందిన రూ.4.81 కోట్ల విలువైన ఆస్తులను తాత్కాలికంగా జప్తుచేసినట్లు గత నెలలో ఈడీ పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి 2018లోనే సత్యేంద్రను ఈడీ అధికారులు ప్రశ్నించారు. మరోవైపు, ఈడీ తీరుపై ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తీవ్రంగా మండిపడ్డారు. ప్రతిపక్షాలను బెదిరింపులకు గురిచేసేందుకు బీజేపీ సర్కారు... కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలను వాడుకుంటోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలోనే సత్యేంద్ర జైన్‌ను ఈడీ అరెస్టు చేయనుందని తమకు సమాచారం ఉన్నట్లు పంజాబ్ ఎన్నికల ముందే కేజ్రీవాల్ తెలిపారు. సత్యేందర్ తనతోపాటు మరో మంత్రి మనీశ్ సిసోడియాపై కూడా ఈడీ దాడులు జరగవచ్చని అప్పట్లో కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు.

తమిళనాడు దంపతుల ఆదర్శం

కుమార్తెకు కుల, మత రహిత సర్టిఫికెట్

కోయంబత్తూరు: కుల, మత రహితంగా భవిష్యత్ సమాజ నిర్మాణం సాధ్యమేనని తమిళనాడుకు చెందిన దంపతులు నిరూపించారు. తమ మూడున్నరేళ్ల కుమార్తె విల్మా ను కిండర్ గార్డెన్ పాఠశాలలో చేర్పడం కోసం కులం, మతం పేరు లేకుండా ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్‌ను పొందారు. పూర్తి వివరాల్లోకి వెళితే కోయంబత్తూరుకు చెందిన నరేశ్ కార్తీక్, గాయత్రి అనే దంపతులు తమ కుమార్తెను పాఠశాలలో చేర్చే సమయంలో యాజమాన్యం కుల, మత సర్టిఫికెట్లు అవసరమని తెలిపారు. తాము అటువంటి సర్టిఫికెట్లు పొందేందుకు ఇష్టపడడం లేదని తెలిపినా వారు పాఠశాలలో చేర్చుకోవడానికి ముందుకురాలేదు. దీంతో కుల, మత వివరాలతో సంబంధం లేకుండా నడిచే పాఠశాలల కోసం అన్వేషించినా ఫలితం దక్కక పోవడంతో తమ సమస్యను జిల్లా కలెక్టర్ జీఎస్ సమీరన్ దృష్టికి తీసుకెళ్లారు. 1973లో తమిళనాడు ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. తమ కుమార్తెకు భవిష్యత్తులో కుల, మతం ఆధారంగా వచ్చే రిజర్వేషన్లు అవసరంలేదని పేర్కొంటూ ఒక అఫిడవిట్‌ను సైతం సమర్పించారు. స్పందించిన కలెక్టర్ 1973 నాటి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం దంపతులు కోరిన తరహాలో చిన్నారికి కుల, మత రహిత సర్టిఫికెట్ ఇవ్వాలని తహశీల్దార్‌ను ఆదేశించారు.

ఇంట్లో ఈగల మోత బయట పల్లకీ మోతలా తెలంగాణ అభివృద్ధి: నారాయణ

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ పరిస్థితి ఇంటో ఈగత మోత, బయట పల్లకి మోతలా తయారైందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ విమర్శించారు. సీఎం కేసీఆర్ దేశ వ్యాప్తంగా చేపట్టిన రాజకీయ పర్యటనల్లో భాగంగా పంజాబ్ వెళ్లి అక్కడి ప్రజలకు ఆర్థిక సాయం చేశారని, అదే సమయంలో రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు కూడా చెల్లించలేక పోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన టంచనుగా ఇచ్చే పరిస్థితి లేకుండా ఆర్థిక వ్యవస్థను దిగజార్చారని వ్యాఖ్యానించారు. పెద్ద ఎత్తున అప్పులు చేస్తున్న కారణంగా అదనపు అప్పులకు ఆర్‌బీఐ కూడా అనుమతించడం లేదని పేర్కొన్నారు. బాండ్లను కూడా అమ్మే పరిస్థితి కూడా లేకుండా పోయిందన్నారు. దిగజారుతున్న ఆర్థిక పరిస్థితి కారణంగా భూముల రేట్లను పెంచుతూ ప్రజలపై పన్నుల భారాలు మోపుతున్నారని పేర్కొన్నారు. ఈ తరహాలో పరోక్షంగా, ప్రత్యక్షంగా ప్రజలపై భారాలు మోపడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేసి అంతాబాగుందంటూ ప్రభుత్వ పెద్దలు ప్రచారం చేసుకోవడంలో అర్థం లేదని పేర్కొన్నారు. ఈ కారణంగానే రాష్ట్ర అభివృద్ధి ఇంట్లో ఈగల మోత, బయట పల్లకీ మోతలా మారిందని తాను భావిస్తున్నానంటూ సోమవారం మీడియాకు విడుదల చేసిన ఒక వీడియోలో వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్‌కు బీజేపీ భయపడుతోంది: చిదంబరం

చెన్నై : బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తమ పార్టీ సిద్ధాంతాలకే భయపడుతోందని, తనకు కాదని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం సోమవారం అన్నారు. జూన్ 10న జరగనున్న రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికపై తన పార్టీలో వినిపిస్తున్న అసంతృప్తిపై వ్యాఖ్యానించేందుకు ఆయన నిరాకరించారు. తమిళనాడు నుంచి రాజ్యసభ ఎన్నికలకు ఇక్కడ అధికారులకు నామినేషన్ దాఖలు చేసిన తర్వాత విలేకరులతో చిదంబరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, వామపక్ష పార్టీలతో సహా డీఎంకే-కాంగ్రెస్ కూటమికి చెందిన ఇతర మిత్రపక్షాలకు ధన్యవాదాలు తెలిపారు. అందరి మద్దతుతోనే తాను నామినేషన్ దాఖలు చేశానని చెప్పారు. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి, కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నేత కే సెల్వపెరుంతగై సహా తమిళనాడు కాంగ్రెస్ నేతలందరి సమక్షంలో అధికారులకు నామినేషన్ సమర్పించారు. తన ఎంపికపై రాష్ట్ర యూనిట్‌లో ఐక్యతను సూచిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని పార్టీ అగ్ర నేత సోనియాగాంధీకి తెలియజేసినప్పుడు ఆమె సంతోషాన్ని వ్యక్తం చేశారని, తనకు అభినందనలు తెలిపినట్లు చిదంబరం తెలిపారు. తన కుమారుడు, పార్టీ ఎంపీ కార్తీ చిదంబరానికి సంబంధించిన ప్రాంగణాల్లో ఇటీవల సీబీఐ సోదాలపై ప్రశ్నించగా, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌తో సహా కేంద్ర ఏజెన్సీలపై తాజా అభిప్రాయాలను వెల్లడించాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. ఆర్యన్ ఖాన్ డ్రగ్స్ కేసు వంటి విషయాలను ఆయన ప్రస్తావించారు. ప్రజలు ఇప్పటికే వారి స్వంత తీర్మానాలను రూపొందించారని అన్నారు. 'మీ స్వంత నిర్ధారణకు రండి. 'వారు నాకు ఎందుకు భయపడాలి? నేను సింహమా లేక పులినా? నేను మనిషిని, కానీ కాంగ్రెస్ పార్టీని ప్రతిబింబించే వ్యక్తిని' అని తెలిపారు. తన రచనలు, ప్రసంగాల్లో పార్టీ సిద్ధాంతాలను సమర్థించినట్లు చెప్పారు. 'వారు నాకు భయపడుతున్నారని నేను అనుకోను... వారు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు భయపడుతున్నారు' అని అన్నారు. డీఎంకే కేంద్రం అనే పదానికి బదులుగా 'యూనియన్' అనే పదాన్ని ఉపయోగించడంపై అడిగిన ప్రశ్నకు, రాజ్యాంగం 'యూనియన్' అనే పదాన్ని ఉపయోగిస్తుంది తప్ప కేంద్ర ప్రభుత్వం కాదని తెలిపారు. ఎగువ సభకు 10 మంది అభ్యర్థులను ఎంపిక చేయడంలో పార్టీలోని అసంతృప్తి స్వరాలపై ఒక ప్రశ్నకు చిదంబరం మాట్లాడుతూ 'మేము గెలవగలిగేది కేవలం 10 సీట్లు మాత్రమే. వారు 10 మంది అభ్యర్థులకు మాత్రమే ఇవ్వగలరు. మీరు ఏమి చేస్తారు?' అని అన్నారు. బలవంతపు మతమార్పిడి ప్రయత్నాలపై (కొన్ని క్రైస్తవ సంఘాలు) బీజేపీ ఆరోపణపై చిదంబరం మాట్లాడుతూ తాను అనేక ఇతర క్రైస్తవ సంస్థలలో చదువుకున్నానని చెప్పారు. 'ఇది అసంబద్ధమైన, తప్పుడు ఆరోపణ' అని అన్నారు. 'క్రైస్తవ పాఠశాలల్లో వందల వేల మంది పిల్లలు చదువుతున్నారు. క్రైస్తవ పాఠశాలలు, కళాశాలల నుంచి ప్రయోజనం పొందిన అనేక తరాలు ఉన్నాయి. ఎవరూ ఎవరినీ మతం మార్చే ప్రయత్నం చేయలేదు. ఇది తప్పుడు ఆరోపణ. దీన్ని మొగ్గలోనే తుంచేయాలి. తమిళనాడు ప్రజలు దీన్ని మొగ్గలోనే తుంచేస్తారని నేను నమ్ముతున్నాను' అని కేంద్ర మాజీ మంత్రి అన్నారు. అంతకుముందు చిదంబరం ఇక్కడ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమిళనాడు నుంచి ఆరు రాజ్యసభ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. డీఎంకేకు చెందిన ముగ్గురు అభ్యర్థులు కేఆర్ఎన్ రాజేష్‌కుమార్, తంజై సు కళ్యాణసుందరం, ఆర్.గిరిరాజన్ ఇప్పటికే తమ నామినేషన్లను దాఖలు చేశారు. డీఎంకే తన మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు ఒక సీటు కేటాయించింది.

కాంగ్రెస్‌లో 'రాజ్యసభ రగడ'

- పదిమంది అభ్యర్థుల ప్రకటనతో అసంతృప్త జ్వాలలు
- నా తపస్సు తగ్గిందా : పార్టీ అధికార ప్రతినిధి పవన్ ఖేరా
- నా సంగతేమిటని ప్రశ్నించిన సినీ నటి, సీనియర్ నేత నగ్మా

న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీలో అసంతృప్త జ్వాలలు చెలరేగాయి. జూన్ 10న జరగనున్న రాజ్యసభ ఎన్నికలకు 10 మంది అభ్యర్థులను ప్రకటించిన తర్వాత పార్టీ నుంచి అసంతృప్తి స్వరాలు వెలువడ్డాయి. ఈ జాబితాపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. అనేక రాష్ట్రాల్లో కీలక నేతలను దూరం పెట్టి.. బయటి వారికి అవకాశం ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇప్పటికే చాలా మంది నేతలు బహిరంగంగానే అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సినీ నటి, కాంగ్రెస్ సీనియర్ నేత నగ్మా మొరార్జీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ట్విటర్ వేదికగా కాంగ్రెస్, కాంగ్రెస్ అధినేత్రిపై కూడా ప్రశ్నల వర్షం కురిపించారు. అభ్యర్థిత్వాలపై ప్రశ్నలను లేవనెత్తారు. రాజ్యసభ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ పది మంది అభ్యర్థులతో కూడిన జాబితాను ఆదివారం ప్రకటించింది. ఇందులో కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం, పార్టీ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా, ప్రధాన కార్యదర్శి ముకుల్ వాస్నిక్, ఉత్తర్‌ప్రదేశ్ నేత ప్రమోద్ తివారీ, జైరాం రమేశ్, వివేక్ టంకాకు కాంగ్రెస్ అధిష్టానం అవకాశం కల్పించింది. వీరితోపాటు రాజీవ్ శుక్లా (చత్తీస్‌గఢ్), మాజీ ఎంపీ పప్పూ యాదవ్ సతీమణి రంజీత్ రంజన్ (బీహార్), అజయ్ మాకెన్ (హరియాణా), ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి (మహారాష్ట్ర)కు అవకాశం కల్పించింది. అయితే ఈ జాబితాపై అనేక మంది సీనియర్ నేతలు అసంతృప్తి వెళ్లగక్కారు. ఆదివారం రాత్రి ట్విటర్ వేదికగా కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా స్పందిస్తూ, 'షాయద్ మేరీ తపస్య మే కుచ్ కమీ రెహ్ గయా (బహుశా నా తపస్సు తగ్గి ఉండవచ్చు)' అని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ తనకు గుర్తింపునిచ్చిందంటూ ఖేరా సోమవారం ఉదయం మరో ట్వీట్ చేశారు. 'నేను నా ఈ అభిప్రాయంతో ఏకీభవించడమే కాకుండా దానికి కట్టుబడి ఉన్నాను' అని పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితం తన ట్వీట్లలో ఒకదాన్ని ట్యాగ్ చేస్తూ, కాంగ్రెస్ పార్టీ వల్లే తమకు గుర్తింపు వచ్చిందన్న విషయాన్ని నాయకులు మర్చిపోకూడదు' అని తెలిపారు. అయితే రాజ్యసభ అభ్యర్థిత్వం పొందిన వారికి ఖేరా అభినందనలు తెలిపారు. ఇదిలాఉండగా, కాంగ్రెస్ ముంబై విభాగం ఉపాధ్యక్షురాలు నటి నగ్మా మొరార్జీ ఈ సారి కూడా రాజ్యసభ టికెట్ దక్కకపోవడంతో భంగపాటుకు గురైంది. దీంతో ఆమె కూడా అసంతృప్తికి లోనయ్యారు. దీంతో పవన్ ఖేరా ట్వీట్‌కు నగ్మా స్పందిస్తూ... 'ఇమ్రాన్ భాయ్ ముందు నా 18 సంవత్సరాల తపస్సు కూడా తక్కువే' అంటూ పార్టీపై విమర్శలు గుప్పించారు. తన నిరాశను స్పష్టం చేశారు. '2003-04లో నేను కాంగ్రెస్ పార్టీలో చేరినప్పుడు స్వయంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా జీ.. నన్ను రాజ్యసభకు పంపుతానని మాటిచ్చారు. అప్పుడు మేము అధికారంలో లేము. అప్పటి నుంచి ఈ 18 ఏళ్లలో వారు నాకు ఒక్కసారి కూడా అవకాశం ఇవ్వలేదు. ఇప్పుడు ఇమ్రాన్‌ను మహారాష్ట్ర నుంచి ఎంపిక చేశారు. ఆ పదవికి నేను అర్హురాలిని కానా?' అని నగ్మా కాంగ్రెస్‌ను ప్రశ్నించారు. అయితే రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిత్వం పొందిన వారిని ఆమె అభినందించారు. కాగా నగ్మా ట్వీట్‌కు కాంగ్రెస్ నాయకుడు ఆచార్య ప్రమోద్ కృష్ణం ఒక ట్వీట్‌లో స్పందిస్తూ, సల్మాన్ ఖుర్షీద్, తారిఖ్ అన్వర్, గులాం నబీ ఆజాద్ తపస్సు 40 సంవత్సరాలకు పైగా ఉంది. కానీ వారు కూడా 'అమరవీరులే' అని పేర్కొన్నారు. మరొక ట్వీట్‌లో, ప్రతిభను 'అణచివేయడం' పార్టీకి 'ఆత్మహత్య దశ' అని అన్నారు. రాజస్థాన్‌లోని సిరోహికి చెందిన స్వతంత్ర ఎమ్మెల్యే సన్యామ్ లోధా పార్టీపై విమర్శలు గుప్పించారు. రాజస్థాన్‌కు చెందిన ఏ కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్తను రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థిని చేయకపోవడానికి కారణం ఏమిటో కాంగ్రెస్ పార్టీ చెప్పాలి?' అని ఆయన హిందీలో ఒక ట్వీట్ చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలను ట్యాగ్ చేశాడు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లో పార్టీ 'బయటి వ్యక్తుల'ను ఎంచుకుంది. అయితే ఈ ఎన్నికలతో రాజ్యసభలో కాంగ్రెస్ ఆధిక్యం పెరుగనున్నది. ప్రస్తుతం రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుల సంఖ్య 29గా ఉంది. కొత్తగా జరిగే ఎన్నికల్లో రాజస్థాన్‌లో 3, చత్తీస్‌గఢ్‌లో 2, తమిళనాడు, జార్ఖండ్, మహారాష్ట్రల్లో ఒక్కొక్కటి చొప్పున రాజ్యసభ స్థానాలను హస్తం పార్టీ గెలుచుకోవడం దాదాపు ఖాయం. అలాగే పార్టీ ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని బట్టి చూస్తే, హరియాణా, మధ్యప్రదేశ్, కర్ణాటకల్లోనూ ఒక్కో స్థానాన్ని కైవసం చేసుకోనున్నది. దీంతో రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుల సంఖ్య 33కి చేరనుంది. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 10 రాజ్యసభ సీట్లు వచ్చే అవకాశం ఉంది. జూన్-ఆగస్టు మధ్య వేర్వేరు తేదీల్లో సభ్యుల పదవీ విరమణ కారణంగా ఖాళీ అయిన 15 రాష్ట్రాల నుంచి 57 రాజ్యసభ స్థానాలను భర్తీ చేయడానికి జూన్ 10 న ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ మే 31.

సివిల్స్‌లో మెరిసిన నర్సీపట్నం తేజం

నర్సీపట్నం: సివిల్ సర్వీసెస్ 2022 ఫలితాల్లో అఖిలభారత స్థాయిలో అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన భరద్వాజ్... 28వ ర్యాంకు సాధించారు. 2017 నుంచి వరుసగా ప్రయత్నించి ఐదోసారి విజయవంతమయ్యారు. గొలుగొండ మండలం, కొత్త మల్లంపేట, హైస్కూలులో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న ప్రసాద్ పెద్ద కుమారుడు భరద్వాజ్. నర్సీపట్నంలోనే నివాసం ఉంటున్నారు. తల్లి రాధాకుమారి ఏరియా ఆస్పత్రిలో ఫార్మాసిస్టుగా పనిచేస్తున్నారు. భరద్వాజ్ నర్సీపట్నంలో డాన్ బాస్కో పాఠశాలలో పదవ తరగతి వరకు చదివారు. ఇంటర్ విశాఖ చైతన్య కాలేజీలో పూర్తి చేసి, వరంగల్ నిట్ లో బీటెక్ పూర్తి చేశారు. తరువాత దానికి సంబంధించిన సంస్థల్లోనే రెండేళ్లపాటు ఉద్యోగం చేస్తూ, మరలా సివిల్ సర్వీసెస్ పై దృష్టి సారించారు. మూడు దఫాలుగా చేసిన ప్రయత్నం విఫలం అయ్యింది. అయినా తల్లిదండ్రులు ప్రోత్సాహంతో మరలా ఉద్యోగంలో చేరి, తన ప్రయత్నాన్ని కొనసాగించి, ఐదోసారి జాతీయ స్థాయిలో 28వ ర్యాంకు సాధించారు.

పేదల అభ్యున్నతికి కృషి చేస్తా : ఈ సందర్భంగా భరద్వాజ్ మాట్లాడుతూ... పేదల జీవన ప్రమాణాలు పెంచే దిశగా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేస్తూ అన్ని వర్గాలు అభివృద్ధి సాధించే దిశగా తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. మూడో సారి విఫలమైనప్పుడు కాస్త నిరాశ చెందినా తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహంతో తన కృషిని కొనసాగించానన్నారు. పీఆర్టీయు జిల్లా అధ్యక్షుడు డీజీ నాథ్ తో పాటు అనేకమంది భరద్వాజ్‌కు తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

పుల్వామా ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదుల హతం

శ్రీనగర్ : జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో ఆదివారం రాత్రి ఉగ్రవాదులకు, భద్రతా బలగాలకు మధ్య చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టినట్టు భద్రతా బలగాలు తెలిపాయి. జిల్లాలోని గుండిపోరా గ్రామంలో ఉగ్రవాదులున్నట్టు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు అక్కడ సెర్చి ఆపరేషన్ నిర్వహిస్తుండగా ఉగ్రమూక కాల్పులకు తెగబడడంతో ఎదురుకాల్పులకు దిగినట్టు పోలీసు అధికార ప్రతినిధి తెలిపారు. మృతి చెందినవారిని జేషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు చెందిన అబిద్ హుస్సేన్ షా, సాకిబ్ ఆజాద్‌గా గుర్తించినట్టు తెలిపారు. వీరిద్దరూ సాధారణ పౌరులు, పోలీసులు లక్ష్యంగా అనేక ఉగ్రవాద కార్యకలాపాల్లో భాగస్వామ్యమైనట్టు పోలీసు రికార్డుల్లో నమోదైందని కశ్మీర్ ఐజీపీ విజయ్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలో ఉగ్రవాద కార్యకలాపాల నివారణకు కృషి చేస్తున్నామని, స్థానిక యువత ఉగ్రవాదుల వలలో పడకుండా సాంకేతిక వ్యవస్థల ద్వారా నిఘా పెట్టినట్టు వివరించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.